@vaartanews @mvnewstv

మన మీ.. వార్త

ప్రతి అక్షరం... ప్రజల కోసం

తెలుగు దిన పత్రిక

www.mivaartanews.com

TGBIL/25/A0512

శనివారం

14 నవంబర్ 2026

సూర్యపేట, హైదరాబాద్

MANA MI VARTA NEWS

సంపుటి : 02

సంచిక :131

పేజీలు : 12 వెల : 5/-



PUBLISHED AT SURYAPETA | HYDERABAD | KHAMMAM | KARIMNAGAR | MAHABOOBNAGAR | NALGONDA | NIZAMABAD | WARANGAL | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE



ప్రపంచ దేశాల చూపు బ్రహ్మోస్‌పైనే!

- ఫిలిప్పీన్స్, వియత్నాం బాటలో మరిన్ని దేశాలు..
- క్షిపణుల కొనుగోలుకు ఆసక్తి
- ఆపరేషన్ సిందూర్‌తో పెరిగిన అంతర్జాతీయ డిమాండ్..
- ప్రభుత్వ అనుమతుల కోసం ఎదురుచూపులు



బీజేపీ, బీఆర్ఎస్‌ది ఒకే వైఖరి



- రాహుల్ హైదరాబాద్ పర్యటనను అడ్డుకుంటామనడం సరికాదు
- బీజేపీ, బీఆర్ఎస్ నేతలు విజ్ఞత ప్రదర్శించాలి..
- భారత్ సమ్మిట్‌తో తెలంగాణ ఖ్యాతి ప్రపంచానికి చాటుతాం
- రాహుల్ పర్యటనను స్వాగతించాలి
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర అనుకూలతలు, ఘనతలు, పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయడమే లక్ష్యంగా భారత్ సమ్మిట్ నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం కల్పించడంతోపాటు స్పష్టమైన విధివిధానాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని వెల్లడించారు. భారత్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హైదరాబాద్‌కు వస్తానంటే అడ్డుకుంటామని కొందరు వ్యాఖ్యానించడం సరికాదని అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం పలు అంశాలపై మాట్లాడారు. రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటనపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అభ్యంతరాలు వ్యక్తం చేయడాన్ని రేవంత్ రెడ్డి - మిగతా 11 లో



బంగాళాఖాతంలో మరో తుపాను ఏర్పడితే.. పేరు ఇదే.. 'అక్వాన్'!

- బంగాళాఖాతంలో ఈ నెల 18 నాటికి తుపాను ఏర్పడే అవకాశం
- తుపానుగా మారితే ఇరాన్ ప్రతిపాదించిన 'అక్వాన్' పేరు ఖరారు
- దక్షిణ అండమాన్ సముద్రంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

ఆటో కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు!

- హైదరాబాద్‌లో నాలుగు ప్రాంతాల్లో 2 వేల ఎల్ఐజీ ఫ్లాట్ల నిర్మాణం
- రూ.220 కోట్లతో ఆటోనగర్ కాలనీల ఏర్పాటు
- బండ్లగూడ, గంధంగూడ, పేట్‌బషీరాబాద్, జల్‌పల్లి లక్ష్మీగూడలో నిర్మాణాలు
- ఒక్కో ప్రాంతంలో 500 ఫ్లాట్లు.. హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో పనులు

హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం ఆటో కార్మికుల కోసం ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని నిర్ణయించింది. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలోని నాలుగు ప్రాంతాల్లో ఆటోనగర్ కాలనీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.220 కోట్లతో 2 వేల ఎల్ఐజీ (అల్పాదాయ వర్గాల) ఫ్లాట్ల నిర్మాణానికి ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. బండ్లగూడ, గంధంగూడ, పేట్‌బషీరాబాద్, జల్‌పల్లి లక్ష్మీగూడ ప్రాంతాల్లో హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో ఈ కాలనీలను - మిగతా 11 లో

శాస్త్రీయ అభివృద్ధికి మైసూరు రాజకుటుంబం కృషి



- విజ్ఞానం.. ఆధ్యాత్మికత.. భారతీయ సంస్కృతిలో రెండూ విడదీయలేనివి!
- సైన్స్, స్పిరిచ్యువాలిటీ కలిసే ముందుకు సాగుతాయి..
- చంద్రయాన్-3తో అంతరిక్ష రంగంలో సత్తా చాటాం
- మైసూరులో దేశంలోనే తొలి ఎల్ఈడీ డోమ్ ప్లానిటోరియం ప్రారంభం..
- 100 కి.మీ. మెట్రో నెట్‌వర్క్ క్లబ్‌లో బెంగళూరు



'ఆపరేషన్ సిందూర్' ప్రైవేటు భద్రతా సిబ్బంది ప్రాధాన్యాన్ని చాటింది

- మాజీ ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది
- దేశంలో కోటి మందికి పైగా ఈ రంగంలో పనిచేస్తున్నారన్న ద్వివేది
- వారి అనుభవానికి గుర్తింపు, నైపుణ్యాలకు ధ్రువీకరణ కల్పించాలని సూచన
- పోలీసు, అగ్నిమాపక విభాగాలతో సమన్వయం పెంచాలని వ్యాఖ్య
- వివిధ సంస్థలు సమన్వయంతో పనిచేయడం వల్లే రక్షణ సాధ్యమైందని వెల్లడి
- భౌతిక ప్రపంచంతో పాటు డిజిటల్ రంగం, ప్రజల ఆలోచనా విధానాల్లోనూ సంఘర్షణలు జరుగుతున్నాయని ద్వివేది

ఆర్థిక న్యాయమే అభివృద్ధికి పునాది

- భాగ్యనగరంలో భారత్ సమ్మిట్-2026 షురూ!
- తెలంగాణ రైజింగ్‌పై అంతర్జాతీయ వేదికగా చర్చలు..
- తొలిరోజు నాలుగు కీలక అంశాలపై మేధోమథనం
- పట్టణీకరణ, ఫ్యూచర్ సిటీ, ఆర్థిక న్యాయం, సామాజిక న్యాయం, సంక్షేమంపై నిపుణుల అభిప్రాయాలు
- రెండోరోజు రాహుల్ గాంధీ హాజరు.. మరో నాలుగు అంశాలపై చర్చలు



హైదరాబాద్

ప్రపంచ రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిణామాలపై సమగ్ర చర్చకు భాగ్యనగరం వేదికగా నిలిచింది. 'ఫోర్జింగ్ ఏ న్యూ వరల్డ్' (కొత్త ప్రపంచ నిర్మాణం) ఇతివృత్తంతో నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్--2026 రెండో ఎడిషన్ హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో శుక్రవారం ప్రారంభమైంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన రాజకీయ నాయకులు, మాజీ ప్రధానులు, మాజీ మంత్రు లు, ఎంపీలు, రాయబారులు, విధాన నిర్ణేతలు, మేధావులు, సామా జికవేత్తలు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. తొలిరోజు తెలంగాణ రైజింగ్ ఇతివృత్తంగా పట్టణీకరణ, ఫ్యూచర్ సిటీ, ఆర్థిక న్యాయం, సామాజిక న్యాయం, సంక్షేమం వంటి అంశాలపై చర్చలు నిర్వహిం చారు. తెలంగాణ అభివృద్ధి ప్రణాళికలు, సామాజిక - మిగతా 11 లో



పల్లెలకూ పాకిన గంజాయి మహమ్మారి!

- మత్తులో యువత భవిష్యత్తు ఛిద్రం.. ఈజీ మనీ కోసం విక్రయదారులుగా మారుతున్న విద్యార్థులు
- అశ్వారావుపేట, దమ్మపేటలో పెరుగుతున్న గంజాయి కేసులు.. గొలుసుకట్టు దుకాణాలే అడ్డాలుగా ఆరోపణలు
- రవాణా, విక్రయాలపై పోలీసుల నిఘా..

అశ్వారావుపేట

ఒకప్పుడు నగరాలకే పరిమితమైన మాదకద్రవ్యాల వినియోగం ఇప్పుడు క్రమంగా గ్రామీణ ప్రాంతాలకూ విస్తరిస్తోంది. ముఖ్యంగా గంజాయి మత్తులో యువత పెడదారి పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. తాత్కాలిక ఆనందం కోసం మొదలయ్యే ఈ అలవాటు చివరకు జీవితాలను ఛిద్రం చేస్తోంది. కొందరు యువకులు మత్తుకు బానిసలవుతుండగా, మరికొందరు సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో గంజాయి విక్రయాల వైపు - మిగతా 11 లో

భారత్‌కు ఇంకా సంపూర్ణ ఆహార భద్రత లేదు!

- వంటనూనెల కోసం విదేశీ దిగుమతులపైనే ఆధారం.. ఏటా 17 మిలియన్ టన్నుల దిగుమతి
- అంతర్జాతీయ ధరల హెచ్చుతగ్గులతో దేశీయ మార్కెట్‌పై ప్రభావం..
- ఆహార ఉత్పత్తుల స్వయం సమృద్ధిపై నీతి ఆయోగ్ ఆందోళన



సంపాదకీయం

కాంగ్రెస్‌కు బీలాంగింగ్ వరమా... శాపమా...

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' విడుదలైనప్పటి నుండి భారత రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇందులో ఆమె ప్రస్తావించిన పలు కీలక చారిత్రక అంశాలను ఆయుధంగా చేసుకుని భారతీయ జనతా పార్టీ కాంగ్రెస్‌పై ఎదురుదాడికి దిగుతోంది.ముఖ్యంగా రాబోయే ఉత్తరప్రదేశ్, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ పుస్తకంలోని అంశాలు బీజేపీకి రాజకీయంగా కలిసొచ్చే అస్త్రాలుగా మారాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.బీజేపీకి అస్త్రాలుగా మారిన ప్రధాన అంశాలు? ఎమర్జెన్సీ ప్రస్తావన. 1975లో ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ ఒక పొరపాటు అని, తర్వాత ఇందిర కూడా అదే అభిప్రాయానికి వచ్చారని సోనియా ఈ పుస్తకంలో పేర్కొన్నారు. దీనిపై బీజేపీ స్పందిస్తూ, నెహ్రూ–గాంధీ కుటుంబం చేసిన చారిత్రక తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకే ఆమె ప్రయత్నిస్తున్నారని, ఈ పుస్తకానికి 'బిలాంగింగ్' బదులు 'వైట్‌వాషింగ్' అని పేరు పెట్టి ఉండాల్సిందని బీజేపీ అధికార ప్రతినిధి సి.ఆర్. కేశవన్ విమర్శించారు. 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లు. ఈ పుస్తకంలో 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్లపై తన కుటుంబానికి క్లీన్ చిట్ ఇచ్చుకునే ప్రయత్నం జరిగిందని బీజేపీ ఆరోపిస్తోంది. పంజాబ్ ఎన్నికల ముంగిట ఈ అంశం కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా, బీజేపీకి అనుకూలంగా మారే అవకాశం ఉంది. ముందు తన పిల్లలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో ఈ విషయంపై చర్చించినట్లు సోనియా వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తాను ప్రధానమంత్రి పదవి చేపట్టాలా? అని వారిని అడిగినప్పుడు ఇద్దరూ స్పష్టంగా వద్దని చెప్పారని రాశారు. ఇందిరా గాంధీ హత్య, రాజీవ్ గాంధీ హత్యను ప్రత్యక్షంగా చూసిన తమకు, తల్లి కూడా ప్రధానమంత్రి అయితే కుటుంబానికి ముప్పు పెరుగుతుందనే భయం ఉండేదని ఆమె వివరించారు. తాను ప్రధాని కావడం లేదని చెప్పినప్పుడు పిల్లలు ఎంతో ఉపశమనం పొందారని గుర్తుచేసుకున్నారు.2004 ఎన్నికల ఫలితాల తర్వాత ప్రధానమంత్రి పదవిని స్వీకరించాలా? వద్దా? అనే విషయంలో తాను తీవ్ర మానసిక సంఘర్షణకు గురయ్యానని సోనియా గాంధీ రాశారు. ఒకవైపు కాంగ్రెస్ కార్యకర్తల ఆశలు, ప్రజల నమ్మకం, మరోవైపు తన వ్యక్తిగత భయాలు, కుటుంబ భద్రత వంటి అంశాలు తనను ఆలోచనలో పడేశాయని తెలిపారు. చివరకు ప్రధానమంత్రి పదవిని తిరస్కరించాలని నిర్ణయించుకున్న రాత్రి తన మనసులోని సందేహాలన్నీ తొలగిపోయాయని పేర్కొన్నారు. తన అంతరాత్మ నుంచి 'సోనియా.. నీకు నువ్వు నిజాయితీగా ఉండు. ఈ విషయం నీకు ఎప్పటినుంచో తెలుసు. దాన్ని వదిలేయ్!' అనే భావన కలిగిందని పుస్తకంలో వివరించారు.తన నివాసంలో కాంగ్రెస్, సంకీర్ణ పార్టీల నేతలు ప్రధానమంత్రి పదవిని స్వీకరించాలని కోరిన సమావేశాన్ని కూడా ఆమె గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో రాహుల్ గాంధీ తనను 'మీరు ప్రధానమంత్రి కావడానికి ఎందుకు అంగీకరించారు?' అని ప్రశ్నించారని తెలిపారు. నాయకులు తన మాట వినడం లేదని, ఒత్తిడి చేస్తున్నారని తాను సమాధానమిచ్చినట్లు రాశారు. మరోవైపు ప్రియాంక గాంధీ కూడా తన నిర్ణయానికి కట్టుబడి ఉండాలని సూచించారని, ఆ సమయంలో ఆమె భావోద్వేగానికి గురయ్యారని వెల్లడించారు.తాను ప్రధానమంత్రి అయితే బీజేపీ, దాని మిత్రపక్షాలు తన విదేశీ మూలాన్ని రాజకీయ అస్త్రంగా ఉపయోగించుకునే అవకాశం ఉందని సోనియా భావించారు. దీనివల్ల దేశంలో రాజకీయ వివాదం పెరిగి, ప్రభుత్వం పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభావం పడుతుందని ఆందోళన చెందారు. తనకు ప్రధానమంత్రి పదవి కంటే దేశంలో స్థిరమైన, సమర్థవంతమైన, లౌకిక ప్రభుత్వం ఏర్పడటమే ముఖ్యమని పేర్కొన్నారు.2004లో పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో కాంగ్రెస్ నేతల సమావేశంలో తాను ప్రధానమంత్రి పదవిని చేపట్టబోనని ప్రకటించినప్పుడు పలువురు నాయకులు నిరసన వ్యక్తం చేశారని సోనియా గుర్తుచేసుకున్నారు. కొందరు నిర్ణయం మార్చుకోవాలని కోరడంతో కొద్దిసేపు ప్రసంగాన్ని ఆపాల్సి వచ్చిందని తెలిపారు. అయినప్పటికీ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. అనంతరం డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరును ప్రధానమంత్రి పదవికి ప్రతిపాదించారు. దీంతో యూపీఏ ప్రభుత్వానికి మన్మోహన్ సింగ్ నాయకత్వం వహించారు.మొత్తంగా, ప్రధానమంత్రి పదవిని తిరస్కరించడం వెనుక కుటుంబ భద్రత, రాజకీయ పరిస్థితులు, వ్యక్తిగత సిద్ధాంతాలు కీలకంగా ఉన్నాయని సోనియా గాంధీ తన ఆత్మకథలో వివరించారు. 2004లో దేశ రాజకీయాలను మలుపు తిప్పిన తన నిర్ణయంపై ఇన్నేళ్ల తర్వాత ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు మరోసారి చర్చనీయాంశంగా మారాయి.2004 ప్రధాని పదవి త్యాగం మరియు 'సూపర్ పీఎం'. 2004లో తాను ప్రధాని పదవిని ఎందుకు వదులుకున్నానో సోనియా ఈ పుస్తకంలో వివరించారు. అయితే, 1999లో వాజ్‌పేయి ప్రభుత్వం పడిపోయినప్పుడు సంఖ్యాబలం లేకపోయినా ఆమె ప్రధాని కావాలని ఆశపడ్డారని బీజేపీ ఎంపీ సుధాంశు త్రివేది విమర్శించారు. 2004లో ప్రధాని పదవిని వదులుకున్నట్లు నటిస్తూ, నేషనల్ అడ్వైజరీ కౌన్సిల్ చైర్‌పర్సన్‌గా ఉంటూ మన్మోహన్ సింగ్ ప్రభుత్వంపై పెత్తనం చెలాయించి 'సూపర్ పీఎం' గా వ్యవహరించారని బీజేపీ దుయ్యబట్టింది. భారత పౌరసత్వం వివాదం. 1968లో రాజీవ్ గాంధీని వివాహం చేసుకుని భారత్‌కు వచ్చిన సోనియా, 1983 వరకు అంటే 15 ఏళ్ల పాటు ఇటలీ పాస్‌పోర్టునే ఎందుకు కొనసాగించారన్న పాత వివాదాలను బీజేపీ నేతలు మళ్లీ తెరపైకి తెచ్చారు. రాజీవ్ గాంధీ క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించే సమయానికే ఆమె భారత పౌరసత్వం తీసుకోవడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని బీజేపీ ప్రశ్నిస్తోంది. బాబ్రీ మసీదు కూల్చివేత. 1992 నాటి బాబ్రీ మసీదు కూల్చివేత ఘటనపై సోనియా చేసిన వ్యాఖ్యలను కూడా బీజేపీ తప్పుబట్టింది. దశాబ్దాల పాటు భారత రాజకీయాల చక్రం తిప్పిన 10 జన్ పథ్ తెరవెనుక అధికార ప్రస్థానాన్ని, 1998లో కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తీరును, యూపీఏ-1, యూపీఏ-2 సంకీర్ణ ప్రభుత్వాల నిర్వహణలోని అంతర్గత ఒత్తిళ్లను సోనియా ఈ పుస్తకంలో స్పృశించారు. నాటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌తో తన అనుబంధం, 2004లో ప్రధాని పదవిని త్యాగం చేయడం వెనుక ఉన్న అంతరంగిక నిర్ణయాలు, కాంగ్రెస్‌లోని సీనియర్ నేతల అంతర్గత కుమ్ములాటల గుట్టును బయటపెట్టడం జాతీయ స్థాయిలో తీవ్ర రాజకీయ దుమారానికి కారణమైంది. ప్రతిపక్ష అధికార ఎన్‌డీయే కూటమి నాయకులు ఈ ఆత్మకథపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. యూపీఏ హయాంలో జరిగిన పలు ఆర్థిక కుంభకోణాలు, సూపర్ ప్రైమ్ మినిస్టర్ గా నేషనల్ అడ్వైజరీ కౌన్సిల్ ద్వారా సమాంతర అధికారాన్ని చెలాయించారన్న ఆరోపణలను కప్పిపుచ్చుకోవడానికే సోనియా ఈ పుస్తకం ద్వారా సింపథీ కార్డ్ ని ప్రయోగిస్తున్నారని అధికార వర్గాలు విమర్శిస్తున్నాయి. 2004-2014 మధ్యకాలంలో జరిగిన తెరవెనుక రాజకీయాలను తనకు అనుకూలమైన రీతిలో మలచుకున్నారనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, కాంగ్రెస్ శ్రేణులు , ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు మాత్రం సోనియా రాసిన పుస్తకాన్ని సమర్థిస్తున్నాయి. దేశం కోసం భర్తను, అత్తను కోల్పోయినా.. భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థల పరిరక్షణకు, పార్టీ ఉనికికి ఆమె చేసిన త్యాగాలను బిలాంగింగ్ పుస్తకం ప్రపంచానికి చాటిచెబుతోందని అభివర్ణిస్తున్నారు. ఒక విదేశీ మూలాలున్న మహిళగా ఎదుర్కొన్న ఆక్షేపణలను అధిగమించి, భారతీయతను తన సొంతం చేసుకున్న తీరును ఈ పుస్తకం ప్రతిబింబిస్తుందని వారు వ్యాఖ్యానిస్తున్నారు.ఈ పుస్తక ప్రభావం కేవలం గత చరిత్రకే పరిమితం కాకుండా, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ సాగించే నెరేటివ్ యుద్ధానికి ప్రధాన ఇంధనంగా మారనుంది. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల రాజకీయ ప్రస్థానానికి గాంధీ కుటుంబ త్యాగాల నేపథ్యాన్ని మరోసారి ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడానికి ఇది ఒక మాధ్యమంగా ఉపయోగపడనుంది. అదే సమయంలో, బీజేపీ దీనిని ఎదుర్కొనేందుకు యూపీఏ కాలం నాటి పాలనా వైఫల్యాలను, ప్యాలెస్ రాజకీయాలను తిరిగి ఎండగట్టే అవకాశం ఉంది. 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' అనేది కేవలం సోనియా గాంధీ జ్ఞాపకాల సమాహారం మాత్రమే కాదు. అది ఆధునిక భారత రాజకీయ చరిత్రలోని అత్యంత కీలకమైన ఘట్టాలకు అద్దం పట్టే ఒక వివాదాస్పద పత్రం. ప్రేమ, కోల్పోవడం, సాధికారత, అధికార పోరాటాల మధ్య సాగిన ఒక మహిళ జీవిత ప్రయాణం ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్-బీజేపీల మధ్య సరికొత్త పొలిటికల్ డిబేట్‌ను రాజేసింది.యూపీ ఎన్నికల ముందు ఈ అంశాన్ని లేవనెత్తడం ద్వారా హిందూ ఓటర్లను ఆకట్టుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది.

కూలుతున్న ట్రంప్ కలలు



ఇరాన్‌తో యుద్ధం సైనికపరంగా దాదాపు ముగిసినట్లేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈనెల 9న ఖతార్ ప్రధానితో భేటీ అయిన తర్వాత ప్రకటించారు. అయితే పరిస్థితులు మారితే సైనిక చర్యకు సిద్ధంగా ఉన్నామని కూడా ఆయన స్పష్టం చేయడంతో, ఇది యుద్ధానికి నిజమైన ముగింపా లేదా వ్యూహాత్మక విరామమా? అనేది రానున్న వారాల్లో ఖతార్ మధ్యవర్తిత్వ యత్నాల పురోగతిని బట్టి తేలనున్నది. ఇంతకాలం కయ్యానికి కాలుదువ్విన ట్రం ప్ ఇప్పుడు వెనక్కి తగ్గుతున్నట్లు కనిపించడానికి కారణాలేమిటి? సైనికపరంగా, దౌత్యపరంగా ఆశించిన స్థాయిలో ఆయనకు ఫలితాలు దక్కకపోవడం ఈ వెనుకడుగుకు కారణమై ఉండవచ్చు. హొర్ముజ్‌లో ఉద్రిక్తతలు, అమెరికా సహా దాదాపు ప్రపంచమంతటా అలుముకున్న ఆర్థిక అనిశ్చితి, నాటో మిత్రులతో విభేదాలు వంటి కారణాలు ఉండనే ఉన్నాయి. అవన్నీ కూడా విస్తృతంగా చర్చకు వచ్చాయి. అయితే, వీటికి తోడు యుద్ధం ద్వారా సాధించాలనుకున్న వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలు కూడా ప్రశ్నార్థకంగా మారడం ఆయన శాంతి వచనాలకు దారితీసిన కారణమేమో అనే కోణంలో కూడా విశ్లేషించాల్సిన అవసరం ఉన్నది. నోబెల్ బహుమతి సాధించి శాంతిదూతగా ఖ్యాతి పొందాలన్న తన చిరకాల వాంఛను ట్రంప్ బహిరంగంగానే వ్యక్తం చేశారు. కొన్ని దశాబ్దాలుగా అమెరికా, ఇజ్రాయెల్ పెనుముప్పుగా భావిస్తున్న ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిర్వీర్యం చేయడం ద్వారా తన నోబెల్ కలను సాకారం చేసుకోవడం ఆయన లక్ష్యంగా కనిపించింది. ఇజ్రాయెల్ భద్రతకు శాశ్వత భరోసా కల్పించిన నాయకుడిగా చరిత్రలో నిలువడంతోపాటు, అమెరికా రాజకీయాల్లో బలీయమైన ప్రభావం కలిగిన ఇజ్రాయెల్ అనుకూల వర్గాల మద్దతును మరింత పెంచుకోవడం కూడా ఆయన ఆకాంక్షల్లో ఒకటి. ఈ విజయాన్ని తన 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' మద్దతుదారుల ముందు గొప్పగా ప్రదర్శించుకోవచ్చన్నది ఆయన వ్యూహం కావచ్చు. మూడోసారి అధ్యక్ష పదవిని చేపట్టాలన్న ఆకాంక్షను కూడా ట్రంప్ పలుమార్లు వ్యక్తం చేశారు. అయితే, అమెరికా రాజ్యాంగంలోని 22వ సవరణ ప్రకారం..రెండుసార్లు ఆ దేశ అధ్యక్షుడిగా ఎన్నికైన వ్యక్తిని మళ్లీ అధ్యక్షుడిగా ఎన్నుకోవడాన్ని నిషేధిస్తున్నప్పటికీ, ట్రంప్ ఆ అంశాన్ని రాజకీయ చర్చల్లో సజీవంగా ఉంచారు. ఇరాన్‌పై నిర్ణయాత్మక విజయం సాధిస్తే ప్రజాదరణ పెరిగి, 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' ఉద్యమంపై పట్టు కొనసాగించడంతోపాటు, పదవీకాలం తర్వాత కూడా తన వ్యక్తిగత, రాజకీయ ప్రభావాన్ని నిలుపుకోవచ్చన్నది ఆయన భావన కావచ్చు. కానీ, ఇరాన్ తీవ్రంగా ప్రతిఘటించడంతో ఎంతకూ కొలిక్కిరాని యుద్ధం ట్రంప్ మెడకు గుదిబండలా చుట్టుకున్నది. ట్రంప్ కుటుంబానికి గల్ఫ్ దేశాలతో ఉన్న వ్యాపార బంధాలూ ఈ సందర్భంలో చర్చకు వస్తాయి. ఆయన అల్లుడు జారెడ్ కుష్నర్ నిర్వహిస్తున్న అఫినిటీ పార్ట్‌నర్స్ సంస్థలోకి వచ్చిన పెట్టుబడుల్లో అత్యధికం సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ దేశాలకు చెందినవే. ఇరాన్ ముప్పును తొలగించి గల్ఫ్‌కు భద్రత కల్పించిన నేతగా ట్రంప్ నిలిస్తే, ఆ పాలకులతో ఈ బంధాలు మరింత బలపడే అవకాశం ఉండేది. అధ్యక్ష పదవీకాలం ముగిసిన తర్వాత కూడా అవి కుటుంబ వ్యాపార ప్రయోజనాలకు ఉపయోగపడేవి. కానీ యుద్ధం గల్ఫ్ భద్రతను, ఆ దేశాల ఆర్థిక వ్యవస్థకు ఆయువుపట్టు వంటి ఇంధన రంగాన్ని దెబ్బతీసింది. దాంతో, యుద్ధంతో ఏ గల్ఫ్ పాలకుల ప్రయోజనాలను కాపాడి, వారితో తన కుటుంబ వ్యాపార బంధాలను బలపరచుకోవచ్చని ట్రంప్ భావించారో, సాక్షాత్తు వారే యుద్ధ విలయం పట్ల అసంతృప్తితో ఉన్నట్టు బ్లూమ్‌బర్గ్ ఈ ఏడాది మే నెలలో పేర్కొన్నది. యుద్ధం ఇలాగే కొనసాగితే ఈ భాగస్వాములు మరింత దూరం కావచ్చన్న ఆందోళన కూడా ట్రంప్ ప్రస్తుత నిర్ణయానికి కారణం కావచ్చు.

గల్ఫ్ దేశాల వైఖరి కూడా ట్రంప్ వ్యూహానికి ఎదురుదెబ్బలా పరిణమించింది. గత నెల 26న, మక్కా రక్షణ ఒప్పందంలో భాగస్వాములైన సౌదీ అరేబియా, పాకిస్థాన్, టర్కీ దేశాల ఉన్నతాధికారులు టెహ్రాన్‌లో ఇరాన్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ప్రాంతీయ శాంతి, భద్రత కోసం నాలుగు దేశాలు పరస్పర సంప్రదింపులు, సహకారాన్ని కొనసాగించాలని నిర్ణయించాయి. ఇరాన్‌ను ప్రధాన ప్రత్యర్థిగా భావించే సౌదీ అరేబియా సైతం ఆ దేశంతో చర్చలకు సిద్ధపడటం గమనార్హం. ఇది పూర్తిస్థాయి సయోధ్య కాకపోయినా, పరస్పర ప్రయోజనాల దృష్ట్యా ఇరాన్‌తో సంబంధాలను మెరుగుపరచుకోవాల్సిన అవసరాన్ని ఆ దేశాలు గుర్తిస్తున్నాయి. ట్రంప్‌కు ఇది ఇబ్బందికరమైన పరిణామం. అమెరికా భద్రతా హామీలపై ఆధారపడిన సౌదీ వంటి మిత్రదేశాలే తమ ప్రధాన ప్రత్యర్థి ఇరాన్‌తో చర్చలకు సిద్ధపడుతున్నప్పుడు, యుద్ధం కొనసాగింపునకు ప్రాంతీయ మద్దతు ఎంతవరకు ఉందన్నది సందేహాస్పదంగా మారింది. ఇజ్రాయెల్‌లో ట్రంప్‌కు ప్రధాన భాగస్వామిగా, మద్దతుదారుగా ఉన్న నెతన్యాహు రాజకీయంగా బలహీనపడ్డాడు. గత నెల 27న జరిగిన ఎన్నికల్లో ఆయన నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలం సాధించలేకపోయింది. ఈ నెల 8న దేశాధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ ప్రభుత్వ ఏర్పాటుకు గాడీ ఐజెన్‌కాట్‌ను అధికారికంగా ఆహ్వానించారు. ఇరాన్‌పై యుద్ధంలో ట్రంప్‌కు అండగా నిలిచిన ఆయన బలహీనపడటం, ట్రంప్ నైతిక స్థయిర్యాన్ని కూడా దెబ్బ తీయగలిగే పరిణామం. అమెరికాలో ఈ నెల 3న జరిగిన మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు కాంగ్రెస్ ఉభయ సభల్లో అధిక్యం సాధించారు. 10న వెల్లడైన రాయిటర్స్/ఇప్సోస్ సర్వేలో 71 శాతం మంది అమెరికన్లు ఇరాన్ యుద్ధాన్ని ముగించే చట్టాన్ని కాంగ్రెస్ ఆమోదించాలని కోరినట్లు తేలింది. సాధారణంగా ట్రంప్‌కు గట్టి మద్దతుదారులైన రిపబ్లికన్లలో కూడా 51 శాతం మంది ఇదే కోరారు. ఎన్నికల ఫలితాలు, ప్రజాభిప్రాయం రెండూ యుద్ధాన్ని ముగించాలన్న ఒత్తిడిని పెంచుతున్నాయి. తాను కోరుకున్న ప్రయోజనాలేవీ ఆశించిన స్థాయిలో నెరవేరని నేపథ్యంలో, శాంతిదూతగా అవతరించాలన్న తన ప్రగాఢ వాంఛే చివరికి తనను యుద్ధోన్మాదిగా చిత్రించే పరిస్థితికి దారితీయడం ట్రంప్‌నకు రుచించకపోవచ్చు. ఇది కూడా ఆయన తాజా ప్రకటనకు దారితీసిన ప్రధానమైన కారణాల్లో ఒకటయ్యే అవకాశాన్ని విస్మరించలేం.

ఉపాధి 'కల్పనే'



భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా పరుగులు పెడుతున్నదని, ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక శక్తిగా అవతరించిందని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం నిరంతరం ప్రచారం చేసుకుంటున్నది. జీడీపీ వృద్ధి, స్టాక్ మార్కెట్ల రికార్డులు, కార్పొరేట్ సంస్థల లాభాలు, విదేశీ పెట్టుబడుల వెల్లువ అంటూ గొప్పలు చెప్పుకోవడం సరేసరి. కానీ ఈ అభివృద్ధి ఫలాలు సామాన్యులకు, ముఖ్యంగా దేశ యువతకు ఎంతవరకు అందుతున్నాయనే ప్రశ్నకు మాత్రం బీజేపీ నేతల దగ్గర సమాధానం లేదు. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) దేశంలో ఉపాధి పరిస్థితిపై వెలువరించిన తాజా నివేదిక ఆందోళనకరమైన దృశ్యాన్ని ఆవిష్కరించింది. సీఎంఐఈ గణాంకాల ప్రకారం సెప్టెంబర్‌లో 4 శాతంగా ఉన్న నిరుద్యోగిత రేటు అక్టోబర్‌లో 4.7 శాతానికి పెరిగింది. దేశంలో ఉపాధి పొందుతున్నవారి సంఖ్య కూడా తగ్గుముఖం పట్టింది. ఉద్యోగిత రేటు సెప్టెంబర్‌లో 39.4 శాతం ఉండగా అక్టోబర్‌లో 39.3 శాతానికి పడిపోయింది. అక్టోబర్‌లో ఉపాధి పొందినవారి సంఖ్య దాదాపు ఐదు లక్షల మేర తగ్గి 44.95 కోట్లకు చేరింది. గ్రామీణ నిరుద్యోగిత 3.4 శాతం నుంచి 4.7 శాతానికి పెరగడం, మహిళల నిరుద్యోగిత 11.7 శాతం నుంచి 12.7 శాతానికి చేరడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి. ఇవి కేవలం గణాంకాలు కావు. ఉద్యోగాల కోసం, ఉపాధి కోసం నిరీక్షిస్తున్న కోట్లాది మంది యువతీ యువకుల నిరాశకు ప్రతిబింబాలు. 2014 ఎన్నికల ప్రచారంలో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని బీజేపీ నాయకులు ప్రచారాలతో ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చి 12 ఏండ్లు దాటినా ఆ హామీ ఏమైందన్న ప్రశ్నకు కేంద్రం దగ్గర సమాధానం లేదు. ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలు రాస్తూ, నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తూ, వయోపరిమితి దాటిపోతున్న యువతకు ఈ హామీ ఎండమావిగా మారింది. ఎన్నికల ముందు యువత భవిష్యత్తును తమ ప్రచారానికి ఉపయోగించుకున్న బీజేపీ, అధికారంలోకి వచ్చాక ఉపాధి కల్పన గురించి ఏనాడూ పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం ఈ వైఫల్యానికి మరో పెద్ద ఉదాహరణ. 2014 లో అత్యంత ఆర్భాటంగా ప్రారంభించిన ఈ కార్యక్రమం ద్వారా దేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా మారుస్తామని, తయారీ రంగం వాటాను జీడీపీలో 25 శాతానికి పెంచుతామని, భారీగా ఉద్యోగాలు సృష్టిస్తామని ఊరించారు. విదేశీ కంపెనీలను భారత్‌కు ఆహ్వానించారు. ప్రచార పటాటోపం, భారీ సదస్సులు, పెట్టుబడుల ఒప్పందాలతో దేశమంతా హోరెత్తించారు. కానీ దశాబ్దం దాటిన తర్వాత కూడా తయారీ రంగం వాటా జీడీపీలో 15 నుంచి 17 శాతం మధ్యనే కొట్టుమిట్టాడుతున్నది. భారీగా ఉపాధి కల్పిస్తామని ప్రకటించిన లక్ష్యం పడకేసింది. మేక్ ఇన్ ఇండియా ప్రచారానికి, క్షేత్రస్థాయిలో పరిశ్రమల విస్తరణకు మధ్య అంతరం వెక్కిరిస్తున్నది. ఇక్కడ మరో ప్రమాదకర పరిణామం ఏమిటంటే, ఉపాధి గణాంకాల్లో ఉద్యోగులుగా నమోదవుతున్నవారిలో చాలామంది వాస్తవానికి స్వయం ఉపాధి, వ్యవసాయ పనులు, తాత్కాలిక పనులపై ఆధారపడుతున్నవారే. ఒక కుటుంబానికి చెందిన వ్యక్తి చిన్న వ్యాపారం చేయడం, తక్కువ ఆదాయంతో రోజువారీగా కూలీపని చేసుకోవడం కూడా ఉపాధిగానే లెక్కలోకి వస్తుంది. కానీ సదరు అరకొర ఉపాధి ద్వారా లభించే ఆదాయాలు గౌరవప్రదమైన జీవనానికి సరిపోతున్నాయా? అనేది ప్రశ్న. కార్పొరేట్ సంస్థలకు పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలు, భారీ రుణ సదుపాయాలు కల్పించడంలో చూపుతున్న శ్రద్ధలో కొంతైనా యువతకు ఉద్యోగాలు కల్పించడంపై చూపితే దేశ ఆర్థిక ముఖచిత్రం మరోలా ఉండేది. కనీసం ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఒక జాతీయ సమగ్ర ఉపాధి విధానాన్ని ప్రకటించాలి. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులు నిర్దిష్ట వ్యవధిలో భర్తీ చేయాలి. మేక్ ఇన్ ఇండియా, పీఎల్ఐ పథకాల కింద వాస్తవం గా ఎన్ని ఉద్యోగాలు సృష్టించారో వెల్లడిస్తూ శ్వేతపత్రం విడుదల చేయాలి. యువతకు ఉద్యోగాలు కల్పించలేని పాలకులు దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని చెప్పుకోవడం ఆత్మవంచనే అవుతుంది.

బాల్యవివాహాలు లేని సమాజ నిర్మాణమే మా లక్ష్యం





- తిరుపతి శాస్త్రిల,షేర్ జెఆర్ సి జిల్లా కోఆర్డినేటర్ మండల సోషల్ మొబిలైజర్ బోయిని శ్రీజ

టేకుమట్ల నవంబర్ 13 (మన మీ వార్త)

బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనతో పాటు ప్రతి చిన్నారికి విద్య, రక్షణ, భద్రత కల్పించాలనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాల్లో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్, షేర్ ఎన్జీవో డైరెక్టర్ గోపాల్ రెడ్డి ప్రాజెక్టు కోఆర్డినేటర్ తిరుపతి శాస్త్రిల ఆధ్వర్యంలో 100 రోజుల విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నారు.
ఈ ప్రచారంలో భాగంగా టేకుమట్ల మండలం కేజీబీవీ హాస్టల్ లో విద్య శాఖ అధికారులు ఎంఈఓ సుధాకర్, కేజీబీవీ ప్రిన్సిపాల్ స్వప్న మరియు టేకుమట్ల పిఎస్ఏఎస్ఐ రవీందర్ చేతుల మీదుగా బాల్యవివాహాల నిర్మూలన పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం హాస్టల్ విద్యార్థుల సమక్షంలో బాల్యవివాహాల నిర్మూలన కోసం గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడంతో పాటు, బాలికల విద్య ప్రాధాన్యత, బాలల హక్కులు, బాలకార్మిక నిర్మూలనపై విస్తృతంగా ప్రచారం నిర్వహించనున్నారు. గ్రామస్థాయిలో ర్యాలీలు, సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టి బాల్యవివాహాలు లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిస్తున్నారు.బాల్యం బడిలోనే వికసించాలి.. బాలికల భవిష్యత్తుకు బాల్యవివాహాలు అడ్డుకాకూడదు. చిన్నారుల హక్కుల పరిరక్షణకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ తిరుపతి శాస్త్రిల మండల సోషల్ మొబిలైజర్ బోయిని శ్రీజ కోరారు.సమాజ హితమే మా ధ్యేయం -- బాల్యవివాహాలు లేని సమాజమే మా లక్ష్యం. అంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ టీచర్స్ స్టాఫ్ మరియు విద్యార్థులు ,జేఆర్సి షేర్ సోషల్ మొబిలైజర్ బోయిని శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

హనుమసాయి నగర్ కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి రూ.45 లక్షల నిధులు మంజూరు

- కాలనీ వాసులకు నిధుల మంజూరు పత్రాలు అందజేసిన ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్, నవంబర్ 13 (మన మీ వార్త):

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని హనుమసాయి నగర్ కాలనీ అభివృద్ధికి రూ.45 లక్షల నిధులు మంజూరయ్యాయి. కాలనీ వాసులకు గతంలో ఇచ్చిన హామీ మేరకు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఈ నిధులను మంజూరు చేయించారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం, బోర్‌వెల్ ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులను వినియోగించనున్నారు.

ఈ సందర్భంగా శుక్రవారం హనుమసాయి నగర్ కాలనీ వాసులకు పరమేశ్వర్ రెడ్డి నిధుల మంజూరు





పత్రాలను అందజేశారు. ఇచ్చిన మాట ప్రకారం కాలనీ అభివృద్ధికి రూ.45 లక్షలు మంజూరు చేయించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో పాటు తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో దుబ్బ లక్ష్మారెడ్డి, హనుమసాయి నగర్ కాలనీ అధ్యక్షుడు కంచమీద శ్రీనివాస్, కట్ట కృష్ణారెడ్డి, షామీర్‌పేట్ హనుమంత్ రెడ్డి, పూజల లక్ష్మణ్, షామీర్‌పేట్ వినోద్ రెడ్డి, గోపాల్, అన్వర్ పాషా, నర్సింహ, మంద సుమన్, మురళి, శేఖర్, కట్ట శ్రీశైలం, మల్లేష్, శివారెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకట్ రెడ్డి, రమేష్, రంగనాయక్, రాజు, వెంకటేష్, గణేష్, సురేష్, మౌలాలి, శ్రీను సేతు తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నకు ప్రాణహాని కలిగించే కుట్రలను సహించేది లేదు -- రవి పటేల్

- మల్లన్నకు జెడ్ కేటగిరీ భద్రత కల్పించాలి -- డీజీపీకి డిమాండ్

భూపాలపల్లి నవంబర్ 13 (మీవార్త)

తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేపడుతున్న బీసీ రాజ్యాధికార పాదయాత్రకు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక కొందరు రాజకీయ శక్తులు ఆయనపై దాడులకు కుట్రలు చేస్తున్నాయని తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ తీవ్రంగా ఆరోపించారు.

నేటి పాదయాత్ర సందర్భంగా తీన్మార్ మల్లన్న ప్రయాణిస్తున్న ఫార్చునర్ వాహనాన్ని లారీతో ఢీకొట్టే ప్రయత్నం జరిగిందనే వార్తలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

గతంలో బెల్లి లలిత, మారోజు వీరన్న, సాంబశివుడు, ఎర్ర సత్యం వంటి ఎందరో ఉద్యమకారులు సామాజిక న్యాయం, తెలంగాణ హక్కుల కోసం పోరాడుతూ ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. నేడు అదే తరహాలో బీసీల రాజ్యాధికారం కోసం పోరాడుతున్న తీన్మార్ మల్లన్నకు ముప్పు కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయని



అన్నారు.

51 రోజులుగా నిర్విరామంగా వేల కిలోమీటర్లు పాదయాత్ర చేస్తూ బీసీల విద్య, వైద్యం, ఉద్యోగాలు, రాజకీయ వాటా, సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న మల్లన్నను బెదిరింపులతో ఆపలేరని, ఈ ఉద్యమం ఇప్పటికే ప్రజల ఉద్యమంగా మారిందని స్పష్టం చేశారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రజలారా! ఇకనైనా మేల్కొనండి. మన హక్కుల కోసం, మన భవిష్యత్తు తరాల కోసం పోరాడుతున్న నాయకులకు అండగా నిలవండి. మన విద్య, వైద్యం, ఉపాధి, రాజకీయ అధికార సాధన కోసం ఐక్యంగా ఉద్యమిద్దాం. ఆధిపత్య రాజకీయాలకు ప్రజాస్వామ్య పద్ధతిలో గట్టి సమాధానం చెబుదామని రవి పటేల్ పిలుపునిచ్చారు.

ఈ ఘటనను తెలంగాణ సమాజం తీవ్రంగా ఖండించాలని, రాష్ట్ర ప్రజాస్వామ్య చరిత్రలో ఇది ఒక బ్లాక్ డేగా నిలిచిపోతుందని అన్నారు. తెలంగాణ డీజీపీ వెంటనే స్పందించి తీన్మార్ మల్లన్నకు జెడ్ కేటగిరీ భద్రత కల్పించాలని, ఆయన ప్రాణాలకు ఎలాంటి హాని కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తీన్మార్ మల్లన్నకు ఏదైనా హాని జరిగితే దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది. బీసీ రాజ్యాధికార ఉద్యమాన్ని బెదిరింపులతో అణచివేయాలని చూస్తే సహించేది లేదు. ఈ ఘటనపై నిష్పక్షపాత విచారణ జరిపి కుట్ర వెనుక ఉన్న వారిని చట్టం ముందు నిలబెట్టాలని రవి పటేల్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మరో భారీ బీసీ ఉద్యమానికి ఈ ఘటన కారణం కాకముందే ప్రభుత్వం మేల్కొని తగిన చర్యలు తీసుకోవాలని, బీసీ రాజ్యాధికార సాధన కోసం ప్రజలందరూ ఐక్యంగా ముందుకు రావాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు సామల శ్రీలత, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్, అధికార ప్రతినిధి మడే సంతోష్, కోశాధికారి జినుకల శ్రీను, జిల్లా కోఆర్డినేటర్ మోటపోతుల సమ్మయ్య, జిల్లా నాయకులు జిలకల అశోక్, గట్టు శ్రీకాంత్, రోడ్డ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రామంతాపూర్‌లో ఘనంగా గ్యారవీ షరీఫ్ ఆధ్యాత్మిక వేడుకలు

- ఎంఏ జలీల్ పాషా ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహణ.. పాల్గొన్న పలువురు కాంగ్రెస్ నాయకులు, మతపెద్దలు, స్థానిక ప్రముఖులు

రామంతాపూర్, నవంబర్ 13 (మన మీ వార్త):

రామంతాపూర్‌లోని జలీల్ మంజిల్‌లో ఎం.ఏ. జలీల్ పాషా, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో గ్యారవీ షరీఫ్ ఆధ్యాత్మిక ప్రార్థనా సభను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, మతపరమైన కార్యక్రమాలు నిర్వహించి, శాంతి, సోదరభావం, మతసామరస్య సందేశాన్ని చాటారు.ఈ కార్యక్రమానికి ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి, మాజీ ఫ్లోర్ లీడర్ కంది ఆగి రెడ్డి, మహమ్మద్ తౌఫిక్, మైనారిటీ విభాగం అధ్యక్షుడు అజీజ్, మహమ్మద్ రఫీక్, శ్రీకాంత్ యాదవ్, రామంతాపూర్ డివిజన్ అధ్యక్షుడు సందీప్, అరుణ్, వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షుడు రాజిరెడ్డి, చిల్కానగర్ డివిజన్ అధ్యక్షుడు మహేంద్ర, మల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు కిట్టు, అన్వర్, అష్టల్, ఎం. జంగయ్య, జనహా రెడ్డి, యాదగిరి రెడ్డి, చెంచులు, వెంకటేశ్వర్లు, నర్సింహ, ఉదయ్, పెంటయ్య, రబ్బాయి భాయ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. పలువురు రాజకీయ నాయకులు, మతపెద్దలు, సామాజిక ప్రముఖులు, స్థానిక ప్రజలు హాజరై ప్రార్థనల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జలీల్ పాషా మాట్లాడుతూ, కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేసిన అతిథులు, నాయకులు, మిత్రులు, శ్రేయోభిలాషులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గౌసే ఆజం దస్తగీర్ (రహ్మతుల్లాహి అలైహి) వారి దీవెనలతో ప్రతి ఒక్కరికీ శాంతి, సౌభాగ్యం, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించారు.







నకిలీ మందులతో పేద ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న తిరుమల మెడికల్ షాప్

- మెడికల్ షాప్ ను సీజ్ చేయాలి

- బిజెపి మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్

చిట్యాల. నవంబర్ 12 (మీవార్త)



నకిలీ మందులతో పేద ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మెడికల్ షాపులను వెంటనే శాశ్వతంగా సీజ్ చెయ్యాలని బిజెపి మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ డిమాండ్ చేశారు చిట్యాల మండల కేంద్రంలో ఉన్నటువంటి తిరుమల మెడికల్ షాపులో నకిలీ మందులు ఉన్నాయని పక్కా సమాచారంతోనే డ్రగ్ ఇన్స్పెక్టర్ వచ్చి తనిఖీ చేయగా షాపు యొక్క శుభ్రత లేకపోవడం అదేవిధంగా నకిలీ మందులు ఉండడం ఎక్స్పైర్ డేటు అయిపోయినటువంటి మందులు ఉండడం గమనించినటువంటి అధికారులు వారికి ఒక షోకాజు నోటీస్ అందజేసి షాపు ను సీల్ చేయడం జరిగింది కానీ అతను అధికారబలంతో మళ్లీ షాపును తీయడం జరిగింది

మళ్లీ అధికారులు వచ్చి తనిఖీలు చేయగా అధికారులకు వివరణ ఇయ్యకుండానే మళ్లీ షాపులు తెరిచి నకిలీ మందులు అమ్మడం మొదలుపెట్టాడు నిరుపేదల పాణాలతో చెలగాటమాడుతున్న తిరుమల మెడికల్ షాప్ పై జిల్లా కలెక్టర్ మరియు సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకొని సీల్ చేయాలని చేయని ఎడల బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని బిజెపి మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్ హెచ్చరించారు

తెలంగాణ హ్యూమన్ రైట్స్ జస్టిస్ ఫోరమ్ రంగారెడ్డి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎస్. అలేఖ్య నియామకం

- నియామక ఉత్తర్వులు జారీ చేసిన సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ వ్యాసభట్ శ్రీవాణి.. మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానన్న అలేఖ్య

హైదరాబాద్, నవంబర్ 13 (మనం మీ వార్త):



తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మానవ హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తున్న తెలంగాణ హ్యూమన్ రైట్స్ జస్టిస్ ఫోరమ్ రంగారెడ్డి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎస్. అలేఖ్య నియమితులయ్యారు. ఈ మేరకు హబ్సిగూడ లోని ప్రధాన కార్యాలయంలో సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ వ్యాసభట్ శ్రీవాణి ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు.
ఈ సందర్భంగా ఎస్. అలేఖ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ వ్యాసభట్ శ్రీవాణికి, తన నియామకానికి కృషి చేసిన డాక్టర్ సత్యనారాయణ దేవరకొండ (సతీష్), తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌కు కృతజ్ఞతలు తెలిపారు.
మానవ హక్కుల పరిరక్షణకు తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, హక్కులు కోల్పోయిన బాధితులకు అండగా నిలిచి వారికి న్యాయం జరిగేలా నిరంతరం పనిచేస్తానని పేర్కొన్నారు. సంస్థ అభివృద్ధికి బాధ్యతాయుతంగా కృషి చేస్తానని, ఎక్కడైనా మానవ హక్కులకు భంగం కలిగిన సందర్భాల్లో తెలంగాణ హ్యూమన్ రైట్స్ జస్టిస్ ఫోరమ్ తరపున గట్టిగా స్పందిస్తానని తెలిపారు.
ఈ నియామకం తనపై సామాజిక బాధ్యతను మరింత పెంచిందని అలేఖ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు, స్థానిక ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు నూతనంగా నియమితులైన ఎస్. అలేఖ్యకు శుభాకాంక్షలు తెలిపారు.

పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం

- మోకాళ్ల ఆపరేషన్ కోసం రూ.75 వేల ఎల్ఓసీ అందజేసిన మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్

చిలుకానగర్, నవంబర్ 13 (మన మీ వార్త):



ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఒక వరంలా ఉపయోగపడుతుందని మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందించే సహాయం ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు.
బీరప్పగడ్డ డివిజన్ పరిధిలోని సాయిరాం నగర్ కాలనీకి చెందిన మంచినీళ్ల ధనలక్ష్మి (భర్త సత్యం) మోకాళ్ల ఆపరేషన్ నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.75 వేల విలువైన ఎల్ఓసీని మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ స్వయంగా ఆమె నివాసానికి వెళ్లి అందజేశారు.
ఈ సందర్భంగా ధనలక్ష్మి, ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడిన గీతా ప్రవీణ్.. ఆపరేషన్‌కు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తానని భరోసా ఇచ్చారు. ప్రజల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి, పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఎల్లప్పుడూ తన వంతు కృషి చేస్తానని తెలిపారు.తన విజ్ఞప్తి మేరకు వెంటనే స్పందించి ఎల్ఓసీ మంజూరుకు సహకరించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి, అలాగే స్వయంగా ఇంటికి వచ్చి ఎల్ఓసీ అందజేసిన మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్‌కు ధనలక్ష్మి, కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జోరుక సదయ్య ఇంట విషాదం-తల్లి లక్ష్మి కన్నుమూత

-జోరుక సదయ్యకు మాతృ వియోగం-వేముల మహేందర్ గౌడ్ పరామర్శ

- లక్ష్మమ్మ మృతి పట్ల వేముల మహేందర్ గౌడ్ సంతాపం

భూపాలపల్లి నవంబర్ 13 (మీవార్త)



మొగుళ్ళపల్లి మండలం పర్లపల్లి గ్రామానికి చెందిన జోరుక సదయ్య తల్లి లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషాద వార్త తెలుసుకున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్, సదయ్య నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ, “లక్ష్మమ్మ మృతి బాధాకరమని, తల్లిని కోల్పోవడం సదయ్య కుటుంబంలో విషాదాన్ని మిగిల్చిందని, ఆమె పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమెకు స్వర్గలోక పత్రస్తు కలగాలని ఆకాంక్షిస్తూ..వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను” అని తెలిపారు. అదేవిధంగా కొర్కిల గ్రామ మాజీ సర్పంచ్ దానవేణి రాములు కుమారుడు జశ్వంత్ ఇటీవల హైద్రాబాదులో రోడ్డు ప్రమాదంలో మరణించాడు. కాగా విషయాన్ని తెలుసుకున్న వేముల మహేందర్ గౌడ్ శుక్రవారం రాములు కుటుంబాన్ని పరామర్శించి, ఓదార్చారు. మృతి చెందిన జశ్వంత్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయనకు స్వర్గలోక ప్రాప్తిరస్తు కలగాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షుడు దుర్గం సురేష్ గౌడ్, సీనియర్ జర్నలిస్ట్ మాటూరి రవీందర్ గౌడ్, బీసీ యువజన సంఘం జిల్లా కార్యదర్శి పండుగ నాగరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్ నూతన డిప్యూటీ కమిషనర్‌కు కాట సునీత శుభాకాంక్షలు

- 2వ వార్డులో రహదారుల దుస్థితిని అధికారిణి దృష్టికి తీసుకెళ్లిన బీఆర్ఎస్ నాయకురాలు

పటాన్‌చెరు, నవంబర్ 13, మీ వార్త ప్రతినిధి:



అమీన్‌పూర్ నూతన డిప్యూటీ కమిషనర్‌గా నియమితులైన కుమారి లలిత శ్రావణిని బీఆర్ఎస్ నాయకురాలు కాట సునీత మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం అమీన్‌పూర్ 2వ వార్డులో నెలకొన్న సమస్యలను డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా వార్డులోని రహదారులు తీవ్రంగా గుంతలమయంగా మారడంతో స్థానిక ప్రజలు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే రహదారుల మరమ్మతులు చేపట్టాలని కోరారు.అలాగే వార్డులో నెలకొన్న ఇతర స్థానిక సమస్యలను కూడా అధికారిణికి వివరించి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని కాట సునీత విజ్ఞప్తి చేశారు.

శ్రీనివాసపురం కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గానికి ఘన సత్కారం

- నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన ఉప్పల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్ పటేల్.. కాలనీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ





వెంకట్ రెడ్డి నగర్, నవంబర్ 13 (మన మీ వార్త):

వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాసపురం కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులను యువ నాయకుడు, ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్ పటేల్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సత్కరించి అభినందించారు.ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం చైర్మన్ కంది అగిరెడ్డి, అధ్యక్షుడు గదె సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎమ్మాడి సత్యనారాయణ, కోశాధికారి పి. శ్యామేశ్వర్ రావుతో పాటు సలహాదారులు, ఉపాధ్యక్షులు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు, ఇతర కార్యవర్గ సభ్యులను అరుణ్ పటేల్ సత్కరించారు. ఈ సందర్భంగా కాలనీలోని అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలు, స్థానిక సమస్యలపై వారితో చర్చించారు.కాలనీ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ తరఫున సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆకారపు అరుణ్ పటేల్ తెలిపారు. కాలనీలో ఏవైనా సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని నూతన కార్యవర్గ సభ్యులకు హామీ ఇచ్చారు. కాలనీ అభివృద్ధికి సంక్షేమ సంఘం సభ్యులు, స్థానిక ప్రజలతో కలిసి పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి:జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

నిర్మల్ జిల్లా నవంబర్ 13 (మీ వార్త)



జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.

శుక్రవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎస్పీ జానకి షర్మిలతో కలిసి రోడ్డు భద్రతా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో రహదారి ప్రమాదాలు పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు సంబంధిత అధికారులంతా కలిసి పని చేయాలన్నారు. బ్లాక్ స్పాట్ లు గుర్తించి, ఆ ప్రదేశాల్లో ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. వేగ నియంత్రణలు, సూచికల బోర్డులను ఏర్పాటు చేయాలని చెప్పారు. రహదారుల వెంబడి అక్రమంగా వాహనాలు నిలిపితే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రోడ్లపై పశువులు సంచరించకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. పశువులు రోడ్లపైకి వదిలే యజమానులకు జరిమానాలు విధించాలని పేర్కొన్నారు. అవసరమైతే పశువులను స్వాధీనం చేసుకోవాలని స్పష్టం చేశారు.

రోడ్ల వెంబడి ఆక్రమణలు తొలగించాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాలను పూర్తి స్థాయిలో నిర్మూలించాలన్నారు.

ఈ సమావేశంలో భాగంగా జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, జిల్లాలో రహదారి ప్రమాదాల నియంత్రణకు తమ శాఖ పరిధిలో అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఎప్పటికప్పుడు వాహనాల తనిఖీలు నిర్వహించి, డ్రంక్ అండ్ డ్రైవ్, లైసెన్స్, హెల్మెట్ లేని డ్రైవింగ్ చేసే వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. రహదారి భద్రతపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో రహదారి ప్రమాదాల నియంత్రణకు చేపట్టే కార్యక్రమాలన్నింటికీ పోలీసు శాఖ పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట మాధవ రావు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డీఎస్పీ శ్రీనివాస్, డిఎంహెచ్ఓ రాజేందర్, ఈఈ ఆర్ అండ్ బి సుభాష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

MMC పరిధి 3వ డివిజన్ BJR నగర్ లో సొంత నిధులతో UGD పనులకు శ్రీకారం

- 200 మీటర్ల UGD డ్రైనేజీ పనులు ప్రారంభం

- కాలనీ వాసులకు అండగా మాజీ కార్పొరేటర్ మెట్టు ఆశ కుమారి

జవహర్ నగర్, నవంబర్ 12:(వార్త ప్రతినిధి)





మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (MMC) పరిధిలోని 3వ డివిజన్ BJR నగర్ కాలనీలో కాలనీ వాసులు స్వయంగా ముందుకు వచ్చి అభివృద్ధి పనులు చేపట్టారు.

జీవీజ 7వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మెట్టు ఆశ కుమారి సంప్రదించి, వారి సహకారంతో కాలనీ వాసులు తమ సొంత నిధులతో 200 మీటర్ల UGD డ్రైనేజీ పనులను బుధవారం ప్రారంభించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా JMC మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తా, జవహర్ నగర్ అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా నిత్యం ప్రజాసేవలో ఉంటున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కారింగుల శంకర్ గౌడ్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా కాలనీ నాయకులు, మహిళలతో కలిసి ప్రజాపాలనలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జవహర్ నగర్ లో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న కాంగ్రెస్ పార్టీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ణజజ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ దృష్టికి ఈ సమస్యలను తీసుకెళ్లి, త్వరితగతిన అంచెలంచెలుగా పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ హామీ పట్ల BJR నగర్ కాలనీ ప్రజలు DCC అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో జీవీజ మాజీ కార్పొరేటర్లు ఏడ్ల శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, మెట్టు వెంకన్న, భాస్కర్, శ్రీమాన్ వెంకటేష్, వెంకట్ నారాయణ, అంబాజీ, రౌతు అశోక్, యువకులు రాజు, రాహుల్ తదితర నాయకులు, మహిళలు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంబేద్కర్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలి విసికె యూత్ డిమాండ్

- చిట్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కరపత్రాలు ఆవిష్కరించిన

- వి సి కె రాష్ట్ర యూత్ అధ్యక్షులు అంబాల అనిల్ కుమార్

భూపాలపల్లి నవంబర్ 13 (మీవార్త)



జిల్లా కేంద్రంలో పేద, మధ్యతరగతి విద్యార్థులు, నిరుద్యోగ యువతీ యువకుల కోసం అంబేద్కర్ కోచింగ్ సెంటర్ (స్టడీ సర్కిల్) ఏర్పాటు చేయాలని వి సి కె యూత్ వింగ్ డిమాండ్ చేశారు

ఈ డిమాండ్‌పై చేపడుతున్న ఉద్యమంలో భాగంగా చిట్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సమక్షంలో రాష్ట్ర యూత్ అధ్యక్షులు అంబాల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో అంబేద్కర్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తూ కరపత్రాలను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా అంబాల అనిల్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో భూపాలపల్లి ప్రాంతం కీలక పాత్ర పోషించిందని, ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా ఈ ప్రాంతం విద్యాపరంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాగా ఏర్పడినప్పటికీ, నేటికీ విద్యార్థులు, నిరుద్యోగ యువతకు అవసరమైన పోటీ పరీక్షల శిక్షణ సౌకర్యాలు అందుబాటులో లేకపోవడం ఇబ్బందికరంగా ఉందన్నారు.

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మరియు ఇతర బహుజన వర్గాల పేద విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నప్పటికీ, నాణ్యమైన కోచింగ్ పొందేందుకు హనుమకొండ, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా అనేకమంది విద్యార్థులు కోచింగ్ పొందలేక ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నారని వివరించారు. కాబట్టి భూపాలపల్లి జిల్లా కేంద్రంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పేరుతో ఉచిత కోచింగ్ సెంటర్ మరియు స్టడీ సర్కిల్‌ను ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కోచింగ్ పొందే విద్యార్థులకు ప్రస్తుత ధరలకు అనుగుణంగా స్కాలర్‌షిప్‌లు, అవసరమైన అధ్యయన సౌకర్యాలు కల్పించాలని కోరారు.

ఈ సందర్భంగా విద్యార్థులు, యువతీ యువకులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున ముందుకు వచ్చి అంబేద్కర్ స్టడీ సర్కిల్ సాధన కోసం జరుగుతున్న ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్య అనేది ప్రతి ఒక్కరి హక్కు అని, పేద విద్యార్థులకు సమాన విద్యా అవకాశాలు కల్పించేందుకు వి సి కె యూత్ వింగ్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

చికెన్ సెంటర్లపై మున్సిపల్ అధికారుల నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి

-- తెలంగాణ చికెన్ సెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా.. అధికారులకు వినతిపత్రం సమర్పణ

హైదరాబాద్, నవంబర్ 13 (మన మీ వార్త):





సైబరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలోని చికెన్ సెంటర్ల యజమానులకు ఇబ్బందులు కలిగించేలా మున్సిపల్ అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే పునఃపరిశీలించి, వెనక్కి తీసుకోవాలని తెలంగాణ స్టేట్ చికెన్ సెంటర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించి, మద్దతు కోరారు. అనంతరం తెలంగాణ చికెన్ సెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చికెన్ సెంటర్ల యజమానులు ఎంఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తమ వ్యాపారాలకు ఇబ్బందులు కలిగించే నిర్ణయంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారులకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. మున్సిపల్ అధికారులు తీసుకున్న నిర్ణయం అమలులోకి వస్తే చికెన్ సెంటర్ల యజమానులు, వ్యాపారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యాపారాలపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులు, వారి కుటుంబాల జీవనోపాధి సైతం ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.అధికారులు క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి, వ్యాపారులకు ఎలాంటి నష్టం కలగకుండా నిర్ణయం తీసుకోవాలని కోరారు. చికెన్ సెంటర్ల నిర్వహణకు ఇబ్బందులు కలిగించే నిబంధనలను పూర్తిగా వెనక్కి తీసుకోవాలని లేదా వ్యాపారులకు అనుకూలంగా తగిన మార్పులు చేయాలని విజ్ఞప్తి చేశారు. వ్యాపారుల హక్కులు, జీవనోపాధిని కాపాడుకునేందుకు అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ఈ ధర్నా కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ చికెన్ సెంటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి. రాజు, ఉపాధ్యక్షుడు వరుణ్ యాదవ్, శేఖర్ గౌడ్, నాగరాజ్ గౌడ్, అలీ ఖాన్, ఖాజావలి, శ్రీనివాస్ రెడ్డి, లాలాజీ, నెల్లుట్ల శేఖర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

చీకటి నుంచి వెలుగుల్లోకి 23వ వార్డు!

- ప్రజల సమస్యపై తక్షణ స్పందన.. వార్డులో 10 నూతన వీధి దీపాల ఏర్పాటు

- సమస్య చెప్పిన వెంటనే పరిష్కారానికి చర్యలు -- కౌన్సిలర్ పలుస శ్రీకర్ గౌడ్‌పై వార్డు ప్రజల హర్షం

ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో నవంబర్ 13 మీ వార్త :



వనపర్తి టౌన్ న్యూస్ : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు పనిచేసినప్పుడే ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందని 23వ వార్డులో జరిగిన ఈ సంఘటన మరోసారి నిరూపించింది. వార్డులో వీధి దీపాలు లేక రాత్రి వేళల్లో చీకటి అలుముకోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని కౌన్సిలర్ పలుస శ్రీకర్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు.వార్డు ప్రజలు తమ సమస్యను వివరించిన వెంటనే స్పందించిన కౌన్సిలర్ పలుస శ్రీకర్ గౌడ్ ప్రత్యేక చొరవ తీసుకుని వార్డులో మొత్తం 10 నూతన వీధి లైట్లను ఏర్పాటు చేయించారు. దీంతో గత కొంతకాలంగా చీకటితో ఇబ్బందులు పడుతున్న స్థానికులకు ఉపశమనం లభించింది.వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు బయటకు వెళ్లేందుకు భయపడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను గుర్తించి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవడం పట్ల వార్డు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ప్రజలు తమ సమస్యను చెప్పగానే స్పందించి, ఆలస్యం చేయకుండా 10 కొత్త లైట్లు ఏర్పాటు చేయించిన కౌన్సిలర్ పలుస శ్రీకర్ గౌడ్‌కు వార్డు ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల అవసరాలను గుర్తించి, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించడమే నిజమైన ప్రజాసేవ అని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు...

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512

ములుగు జిల్లా రేషన్ కార్డు ఉన్న ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి జాబ్ కార్డు

- దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల్లో నూతన జాబ్ కార్డుల మంజూరు
- ఎల్‌నినో ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో 19 లక్షల పనిదినాల కల్పనకు ప్రణాళిక
- నిరుపయోగంగా ఉన్న జాబ్ కార్డులను పునరుద్ధరించాలి
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

మన మీ వార్త నవంబర్ 13 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



ములుగు జిల్లాలోని అన్ని మండలాల్లో రేషన్ కార్డు ఉండి, అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి జాబ్ కార్డు మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు.

శుక్రవారం ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావుతో కలిసి నూతన జాబ్ కార్డుల మంజూరు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో పేద కుటుంబాలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా వీబీ–గ్రామ్ జీ పథకం ద్వారా 19 లక్షల పనిదినాలను కల్పించేందుకు ప్రణాళిక రూపొందించామని తెలిపారు.

జిల్లాలోని ఏ గ్రామంలోనైనా రేషన్ కార్డు ఉండి, జాబ్ కార్డు లేని అర్హ కుటుంబాలు గ్రామ పంచాయతీ కార్యదర్శిని లేదా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా 5 ఎకరాలలోపు భూమి ఉన్న అర్హత కలిగిన కుటుంబాలన్నీ జాబ్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు సమర్పించిన రెండు రోజుల్లో నూతన జాబ్ కార్డు మంజూరు చేస్తామని పేర్కొన్నారు.

అదేవిధంగా పెద్ద కుటుంబాల్లో ఒకే జాబ్ కార్డు కలిగి ఉన్నవారు, 18 సంవత్సరాలు నిండిన వారు, వివాహమైన వారు అర్హత మేరకు జాబ్ కార్డు విభజన ద్వారా వేర్వేరు జాబ్ కార్డులు పొందవచ్చని తెలిపారు.

గ్రామాల్లో ప్రస్తుతం వినియోగంలో లేని జాబ్ కార్డులను తిరిగి క్రియాశీలం చేసి, ఆయా కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. జాబ్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ సత్వరమే నూతన జాబ్ కార్డులు అందజేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ రవీందర్, ఏపీడీ శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

మన మీ వార్త నవంబర్ 13 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



మహబూబాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించబడుతున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి మరియు కార్యదర్శి టి. శ్రీలత నేడు ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులలో సృజనాత్మకతను, పఠనాసక్తిని పెంపొందించేందుకు వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు.

నవంబర్ 14 (శనివారం), ఉదయం 11:00 గంటలకు: గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభం. అలాగే ఉదయం 11:30 గంటలకు 6 నుండి 10వ తరగతి విద్యార్థులకు లిమానవ జీవన విధానం (నాడు–నేడు)' అనే అంశంపై చిత్రలేఖన పోటీ నిర్వహించబడుతుంది.

నవంబర్ 15 (ఆదివారం), ఉదయం 10:30 గంటలకు ప్రత్యేక పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయబడుతుంది.

నవంబర్ 16 (సోమవారం), ఉదయం 10:30 గంటలకు: 6 నుండి 10వ తరగతి విద్యార్థులకు 'విద్యా సంస్థలలో గ్రంథాలయాల ఏర్పాటు – ప్రాముఖ్యత అనే అంశంపై వ్యాసరచన పోటీ ఉంటుంది.

నవంబర్ 17 (మంగళవారం), ఉదయం 10:30 గంటలకు: 6 నుండి 10వ తరగతి విద్యార్థులకు మానవ జీవితాలపై సోషల్ మీడియా ప్రభావం : వరమా లేదా శాపమా?' అనే అంశంపై ఉపన్యాస పోటీ నిర్వహించబడుతుంది.

నవంబర్ 18 (బుధవారం), ఉదయం 10:30 గంటలకు: 6 నుండి 10వ తరగతి విద్యార్థులకు దేశభక్తి మరియు సామాజిక స్నృహ కలిగే పాటలు'అనే అంశంపై పాటల పోటీ ఉంటుంది.

నవంబర్ 19 (గురువారం), ఉదయం 10:30 గంటలకు: 6 నుండి 10వ తరగతి విద్యార్థులకు ప్రపంచం పై ఎల్నినో ప్రభావం – ఎదురుకొనుటకు గల మార్గాలు అనే అంశంపై రంగోళీ పోటీ నిర్వహించబడుతుంది.

నవంబర్ 20 (శుక్రవారం), ఉదయం 10:30 గంటలకు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశం మరియు విజేతలకు బహుమతి ప్రదానోత్సవం జరుగుతుంది.

ప్రతి పాఠశాల నుండి ప్రతి పోటీకి ఐదుగురు (5) విద్యార్థుల కంటే ఎక్కువ మందిని పంపరాదని నిర్వాహకులు తెలిపారు.

జిల్లాలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాల్సిందిగా జిల్లా గ్రంథాలయ సంస్థ వారు కోరినారు.

జనగామ రీసర్వే భూ క్షేత్రస్థాయి పనులను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్‌షాలోమ్

మన మీ వార్త నవంబర్ 13 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



రంగాపురం గ్రామంలో రీసర్వే పనుల పురోగతిని తనిఖీ చేసి, సంబంధిత అధికారులకు పలు సూచనలు శుక్రవారం, జిల్లాలోని కొడకండ్ల మండలం, రంగాపురం గ్రామంలో కొనసాగుతున్న భూముల రీసర్వే కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్‌షాలోమ్ సందర్శించి, క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా సర్వే ప్రక్రియ జరుగుతున్న తీరును పర్యవేక్షించారు. రీసర్వే పనుల పురోగతి గురించి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

సర్వే పనులను పకడ్బందీగా నిర్వహించాలని, నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా రీసర్వే ప్రక్రియను చేపట్టాలని ఆదేశించారు.

రీసర్వే కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో చేపడుతున్న పనులపై ప్రత్యేక దృష్టి సారించి, సర్వే బృందాలు సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు.

ఈ పర్యటనలో ఏడీ (సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్) మన్యంకొండ, కొడకండ్ల తహసీల్దార్ అనిల్ బాబు, డీఐ, సర్వే బృందాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నపై దాడి-బీసీ జాతిపై దాడిగా భావిస్తున్నాం.

- బీసీల ఎదుగుదలను ఓర్వలేకనే హత్యా కుట్ర.
- బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు,వడ్లకొండ వేణుగోపాల్

భూపాలపల్లి నవంబర్ 13 (మీవార్త)

బీసీ రాజ్యాధికార యాత్రతో రాష్ట్ర వ్యాప్తంగా బీసీలను చైతన్యం చేస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కారుపై జరిగిన లారీ దాడిని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...తీన్మార్ మల్లన్న కారును లారీతో ఢీకొట్టిన తీరు చూస్తే అది ప్రమాదం కాదు, పక్కా ప్రణాళికతో చేసిన హత్యాయత్నం అని స్పష్టంగా తెలుస్తోందన్నారు. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఆయన కారులో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని, కారు నుజ్జునుజ్జు అయిన ఫోటో చూస్తేనే కుట్ర ఎంత పెద్దదో అర్థమవుతుందన్నారు. కారులో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయని ని ఆవేదన వ్యక్తం చేశారు.



బీసీలు ఎదుగుతుంటే ఓర్వలేకపోతున్నారు

"రాష్ట్రంలో 56 శాతం ఉన్న బీసీలు ఇప్పుడిప్పుడే రాజకీయంగా, ఆర్థికంగా ఎదుగుతున్నారని, బీసీ రాజ్యాధికారం కోసం గ్రామ గ్రామాన తిరుగుతూ మల్లన్న బీసీలను ఏకం చేస్తున్నారని, బీసీల ఈ ఎదుగుదల, ఐక్యతను చూసి ఓర్వలేని ఆధిపత్య శక్తులే ఈ దాడికి పాల్పడ్డాయన్నారు. బీసీలు ఎప్పటికీ తమ కాళ్ల దగ్గర ఉండాలని కోరుకునే భావజాలమే ఈ కుట్ర వెనుక ఉంది" అని వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ఆరోపించారు. గతంలో బీసీల కోసం పోరాడిన బెల్లి లలిత, మారోజు వీరన్న లాంటి నేతలను కూడా ఇదే విధంగా అంతమొందించారని, ఇప్పుడు మల్లన్న విషయంలో కూడా అదే పునరావృతం చేయాలని చూస్తున్నారా అనే అనుమానం బీసీ సమాజంలో వ్యక్తమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రభుత్వానికి డిమాండ్:

ఈ ఘటనను పోలీసులు సాధారణ యాక్సిడెంట్ గా కాకుండా, హత్యాయత్నం కోణంలో విచారించాలని, లారీ డ్రైవర్ వెనుక ఉన్న సూత్రధారులను బయటకు తీయాలని డిమాండ్ చేశారు. తీన్మార్ మల్లన్నకు ప్రభుత్వం తక్షణమే భద్రత కల్పించాలని, లేని పక్షంలో ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీలు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ హెచ్చరించారు.

విద్యార్థి దశ నుంచే ఓటు హక్కుపై అవగాహన పెంచుకోవాలి!





- ప్రజాస్వామ్య విలువలను కాపాడే బాధ్యత యువతదే
- 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి -- అదనపు కలెక్టర్ ఎన్. ఖీమ్యా నాయక్

ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో నవంబర్ 13 మీ వార్త

వనపర్తి టౌన్ న్యూస్ : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, యువత విద్యార్థి దశ నుంచే ఓటు హక్కు, ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఎన్. ఖీమ్యా నాయక్ సూచించారు. ఓటరుగా మారిన తర్వాత ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవడంతో పాటు ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని పిలుపునిచ్చారు.ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వనపర్తి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఓటరు నమోదు విధానం, ఈవీఎంల పనితీరు, ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్నారు.ఇందులో భాగంగా 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 7న మండల స్థాయిలో వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో



విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శుక్రవారం వనపర్తి ఐడీఓసీ హాలులో నియోజకవర్గ స్థాయి క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ ఎన్. ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు ఓటు విలువ, ప్రజాస్వామ్యం, ఎన్నికల విధానాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. తమ కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగు వారికి సైతం ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని కోరారు.18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఫారం–6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటరు జాబితాలో పేరు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు.నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి మెరుగైన మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీల మధ్య జిల్లాస్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లాస్థాయిలో మొదటి పది స్థానాల్లో నిలిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ వనపర్తి జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అనంతరం నియోజకవర్గ స్థాయి క్విజ్, వ్యాసరచన పోటీల్లో మొదటి పది స్థానాల్లో నిలిచిన విద్యార్థులను అదనపు కలెక్టర్ అభినందించి వారితో కలిసి ఫోటోలు దిగారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కామా, జెడ్పీ సీఈఓ యాదయ్య, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, సోషల్ మీడియా నోడల్ ఆఫీసర్ పి. సీతారాం, నియోజకవర్గ నోడల్ ఆఫీసర్ సిరాజుద్దీన్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు...

చంద్రపురి కాలనీ డివిజన్ బీజేపీ నూతన కార్యవర్గం నియామకం

- ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్

జవహర్ నగర్ , నవంబర్ 13: (వార్త ప్రతినిధి)

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) చంద్రపురి కాలనీ డివిజన్ కార్యవర్గ సమావేశం డివిజన్ అధ్యక్షులు కర్లపూడి జోగారావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలోని చంద్రపురి కాలనీలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, డివిజన్ ఇన్‌చార్జ్ రవీందర్ గౌడ్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి పేదవాడికి చేరేలా పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. మరోవైపు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.

నూతన కమిటీ ఎంపిక:

పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే లక్ష్యంతో చంద్రపురి కాలనీ డివిజన్ నూతన కార్యవర్గ కమిటీని ప్రకటించారు.



ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, రఘురాం చారి, ఆంజనేయులు, రామకృష్ణ

ప్రధాన కార్యదర్శులు వేపుల సన్నీ, మహేష్ గౌడ్

కార్యదర్శులు రాజేశ్వరం పటేల్, మల్లికార్జున్ గౌడ్, మౌనిక, అన్నం పంకజ్ మోహన్, శివ నేత

అధికార ప్రతినిధులు గండి మహేష్, అనిల్, చంగ బాలరాజు లీగల్ సెల్ కన్వీనర్ రాజశేఖర్ నేత

వివిధ మోర్చాలు, విభాగాల అధ్యక్షులు యువ మోర్చా రాజపుత్ర రాకేష్ మహిళా మోర్చా రాజేశ్వరమ్మ

ఓబీసీ మోర్చా మహేందర్ ముదిరాజ్

ఎస్సీ మోర్చా రాజు నాయక్, మల్లిగారి శ్రీనివాస్ కిసాన్ మోర్చా బత్తుల శ్రీనివాస్ గౌడ్ ఎన్విరాన్‌మెంట్ సెల్ కన్వీనర్ భవాని, నూతనంగా నియమితులైన సభ్యులకు డివిజన్ అధ్యక్షులు కర్లపూడి జోగారావు శుభాకాంక్షలు తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రతి బూత్‌లో పార్టీని బలోపేతం చేస్తూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు మహేందర్ యాదవ్, జిల్లా నాయకులు కుర్ర పుణ్యరాజు, సంతోష్ గుప్తా, ఓం ప్రకాష్, దొంతమల్ల రాంబాబు, చంద్రశేఖర్, లక్ష్మిరెడ్డి, నవీన్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజేత హైస్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు

- టాపర్ విద్యార్థిని బి.గీతికకు రూ.10 వేల నగదు బహుమతి

నర్సాపూర్ మీ వార్త ప్రతినిధి నవంబర్ (13):





నర్సాపూర్ విజేత హైస్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సఫియోద్దీన్,పాఠశాల ప్రిన్సిపల్ దీపక్ దాస్ లు పాల్గొన్నారు.గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో (572) మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి టాపర్‌గా నిలిచిన బి.గీతికకు డైరెక్టర్ సఫియోద్దీన్ చేతుల మీదుగా రూ.10,000 నగదు బహుమతిని అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థులను ప్రోత్సహిస్తూ,చదువుతో పాటు క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ ప్రతిభ కనబరచాలని పాఠశాల యాజమాన్యం సూచించింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ దీపక్ దాస్ విద్యార్థులకు బాలల దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు.విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణ పట్టుదల లక్ష్యసాధన అలవర్చుకోవాలని సూచించారు.విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంపొందించడంతోపాటు ప్రతిభావంతులను ప్రోత్సహించాలని ఉద్దేశంతో ఈ బహుమతిని అందించినట్లు ప్రిన్సిపాల్ దీపక్ దాస్ తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు ప్రోత్సాహం అందించడమే తమ లక్ష్యమని,ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారుఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ షహీన్ బేగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

కౌండిన్య నగర్‌లో రూ.33.80 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణం

- భవాని నగర్‌లో రూ.65 లక్షలతో అండర్‌గ్రౌండ్ స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ పనులు

- అభివృద్ధి పనులను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకుడు మేడల మల్లికార్జున గౌడ్

నాచారం,నవంబర్ 13 (మన మీ వార్త):

ఉప్పల్ నియోజకవర్గంలోని నాచారం డివిజన్ పరిధిలో కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ చేపడుతున్న మౌలిక సదుపాయాల పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా కౌండిన్య నగర్‌లో రూ. 33.80 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు, భవాని నగర్‌లో రూ.65 లక్షల వ్యయంతో 600 ఎం.ఎం. డయా అండర్‌గ్రౌండ్ స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టారు.

ఈ అభివృద్ధి పనులను శుక్రవారం బీఆర్ఎస్ నాయకుడు మేడల మల్లికార్జున గౌడ్ కాలనీవాసులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కౌండిన్య నగర్‌లో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్ల పనుల పురోగతిని, భవాని నగర్‌లో చేపడుతున్న అండర్‌గ్రౌండ్ స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు.ఈ





సందర్భంగా పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత గడువులోగా నిర్మాణాలను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కాలనీవాసులకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడంతో పాటు, వర్షపు నీరు నిలిచిపోవడం, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టడం పట్ల కౌండిన్య నగర్, భవాని నగర్ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ పనులకు నిధులు మంజూరు చేయించి సహకరించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి, క్షేత్రస్థాయిలో పనుల పర్యవేక్షణ చేస్తున్న మేడల మల్లికార్జున గౌడ్‌కు కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రాము, బీఆర్ఎస్ నాయకులు ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, వెంకటేష్, టి.హెచ్. రాయుడు, ఎలాగోని ప్రకాష్ గౌడ్, ఊట్కూరి రాజేష్ గౌడ్, సందీప్ గౌడ్, ఐలయ్య, హరి ప్రసాద్, గొల్లూరి ప్రభాకర్, మొహమ్మద్ యూసఫ్, హరిబాబు తదితరులతో పాటు కాలనీవాసులు ఊట్కూరి కాశి గౌడ్, దేవేందర్ గౌడ్, మేడల హేమంత్ రాజు గౌడ్, సంతోష్ గౌడ్, ప్రసాద్ గౌడ్, మేడల శ్రీనివాస్ గౌడ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే ఓటు హక్కుపై అవగాహన పెంచుకోవాలి!







- ప్రజాస్వామ్య విలువలను కాపాడే బాధ్యత యువతదే

- 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ ఎన్. ఖీమ్యా నాయక్

ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో నవంబర్ 13 మీ వార్త

వనపర్తి టౌన్ న్యూస్ : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, యువత విద్యార్థి దశ నుంచే ఓటు హక్కు, ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఎన్. ఖీమ్యా నాయక్ సూచించారు. ఓటరుగా మారిన తర్వాత ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవడంతో పాటు ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని పిలుపునిచ్చారు.ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వనపర్తి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఓటరు నమోదు విధానం, ఈవీఎంల పనితీరు, ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్నారు.ఇందులో భాగంగా 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 7న మండల స్థాయిలో వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శుక్రవారం వనపర్తి ఐడీఓసీ హాలులో నియోజకవర్గ స్థాయి క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ ఎన్. ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు ఓటు విలువ, ప్రజాస్వామ్యం, ఎన్నికల విధానాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. తమ కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగు వారికి సైతం ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని కోరారు.18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఫారం-6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటరు జాబితాలో పేరు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు.నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి మెరుగైన మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీల మధ్య జిల్లాస్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లాస్థాయిలో మొదటి పది స్థానాల్లో నిలిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ వనపర్తి జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అనంతరం నియోజకవర్గ స్థాయి క్విజ్, వ్యాసరచన పోటీల్లో మొదటి పది స్థానాల్లో నిలిచిన విద్యార్థులను అదనపు కలెక్టర్ అభినందించి వారితో కలిసి ఫోటోలు దిగారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కామా, జెడ్పీ సీఈఓ యాదయ్య, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, సోషల్ మీడియా నోడల్ ఆఫీసర్ పి. సీతారాం, నియోజకవర్గ నోడల్ ఆఫీసర్ సిరాజుద్దీన్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు...

రబీ సాగులో నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించాలి!

వరికి బదులుగా ఆరుతడి, ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్ఆర్ఎస్ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు తప్పనిసరి -- అదనపు కలెక్టర్ ఖీమ్య నాయక్

వనపర్తి టౌన్ న్యూస్ : రాబోయే రబీ 2026-27 సీజన్‌లో ప్రాజెక్టుల్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగు ప్రణాళిక రూపొందించాలని, వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ ఆరుతడి, ఉద్యాన పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్య నాయక్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వనపర్తి జిల్లా ఐడీఓసీ నుంచి అదనపు కలెక్టర్ ఖీమ్య నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్, సంబంధిత జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు. వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక, విద్యాశాఖ, భూసేకరణ, వీధి కుక్కల నియంత్రణ, వివిజిఆర్ఎఎంజి పనుల పురోగతిపై సమీక్షించారు.ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ... నీటి లభ్యత తక్కువగా ఉన్నందున రైతులను ఆయిల్ పామ్, ఉద్యాన పంటలు, కూరగాయల సాగు వైపు ప్రోత్సహించాలని సూచించారు. సూక్ష్మ సేద్యం, పంటల వైవిధ్యీకరణ, ఫార్మర్ రిజిస్ట్రీ నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేసి, రైతుల వివరాల నమోదు పూర్తి చేయాలని, కొనుగోళ్ల ప్రక్రియను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని, ప్రైవేటు మార్కెట్లలో ధాన్యం కొనుగోళ్లను కూడా పర్యవేక్షించాలని తెలిపారు. కనీస మద్దతు ధరతో పాటు ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రయోజనం రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

పాఠశాలల్లో ఎఫ్ఆర్ఎస్ హాజరు తప్పనిసరి...

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో అదనపు కలెక్టర్ ఖీమ్య నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది హాజరును ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ (ఎఫ్ఆర్ఎస్) విధానం ద్వారా తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. పాఠశాలల వారీగా హాజరు శాతాన్ని సమీక్షిస్తూ విద్యార్థుల హాజరు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ వంటి డిజిటల్ అభ్యసన వేదికలను వినియోగించి విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని సూచించారు.అలాగే రూసా 2.0, పీఎం ఉషా, సమగ్ర శిక్ష అభియాన్, పీఎం శ్రీ పథకాల కింద చేపట్టిన పనులను వేగవంతం చేయాలని, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ ఆదేశించారు.సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, గ్రామాలు, పట్టణాల్లో వీధి కుక్కల నియంత్రణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం చర్యలు చేపట్టాలని సూచించారు. వివిజిఆర్ఎఎంజి పథకం కింద నీటి సంరక్షణ నిర్మాణాలు, కాలువల శుభ్రత, భూగర్భ జలాల పెంపునకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈఓ యాదయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు....

ధాన్యం క్వింటాల్ కు రూ.3,500 వచ్చేలా ప్రభుత్వం కృషి చేయాలి

(మన మీ వార్త న్యూస్) : నవంబర్ 13, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-

రైతులకు ధాన్యం క్వింటాల్?కు రూ.3,500 వచ్చేలా ప్రభుత్వం కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్? కులాచారి పేర్కొన్నారు. బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.మ్యాప్‌లు చూడండి

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 5.35 లక్షల ఎకరాల్లో వరి పంటను సాగు చేశారని దినేష్? పేర్కొన్నారు. ఈసారి దిగుబడి ఆశాజనకంగా ఉండి రికార్డు స్థాయిలో 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేశారన్నారు. బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాల్లో పూర్తిగా ఆర్మూర్ సహా జిల్లాలోని మిగతా ప్రాంతాల్లో సగం వరకు పంట కోతలు పూర్తయి రైతులు ఇప్పటికే సుమారు 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లు, కమీషన్ ఏజెంట్లు, దళారులకు అమ్ముకున్నారన్నారు. ప్రారంభంలో పచ్చి సన్న వడ్లు క్వింటాల్‌కు రూ. 3,600 ధర పలకగా, ఇప్పుడు అమాంతం రూ. 2,700 కు పడిపోయిందన్నారు. దీంతో రైతులు తీవ్ర నష్టాలపాలవుతున్నారు.

రైతుల వద్ద ఇంకా 7 లక్షల ? టన్నుల ధాన్యం..

ఇంకా రైతుల వద్ద 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉందన్ని దినేష్? తెలిపారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కనీసం 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేది. కానీ ఈసారి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల వద్ద కాంటాలు కావడం లేదన్నారు. ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం సమీక్షలు చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, బాధ్యతను గాలికి వదిలేసిందని.. రైతులకు సన్న వడ్లపై ఇస్తామన్న బోనస్‌ను ఎగవేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రస్తుతం మార్కెట్‌లో బియ్యానికి విపరీతమైన డిమాండ్ ఉందని.. దీంతో వడ్లకు మార్కెట్?లో క్వింటాల్?కు రూ.3,500 వచ్చేలా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు.



ఎంఎస్‌పీ అంటే కూడా తెలియని ఎమ్మెల్యే..

ప్రభుత్వం వెంటనే పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పేర్కొన్నారు. రైతులు తమ పంటకు కనీస ధర దక్కడం లేదని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి దగ్గరికి వెళితే (మద్దతు ధర) కన్నా ఎక్కువగానే వస్తోంది కదా' అంటూ ఆయన బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం శోచనీయమన్నారు. ఎంఎస్?పీ అంటే మినిమం సపోర్ట్ ప్రైస్ (కనీస మద్దతు ధర) అంతేగానీ మాక్సిమం సపోర్ట్ ప్రైస్ (గరిష్ట మద్దతు ధర) కాదని.. ఎమ్మెల్యేకు కనీస జ్ఞానం కూడా లేకపోవడం ఘోరమని దినేష్? పేర్కొన్నారు. సమావేశంలో నూతుల శ్రీనివాస్ రెడ్డి, బిలోజీ నాయక్, బొబ్బలి వేణు గోపాల్, పద్మరెడ్డి, నరేష్, అమంద్ విజయ్ కృష్ణ, ఎర్రం సుదీర్, బద్దం కిషన్, ఓం సింగ్, గంగారెడ్డి, వంశీ గౌడ్, శంకర్ రెడ్డి, రాజేశ్వర్, అనంద్, జగన్ రెడ్డి, అన్నం గోపి, బట్టురాఘవేందర్, మల్కాయ్ మహేందర్, మఠం పవన్ సుందర్ సింగ్ రాథోడ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరా బంద్....

- కాశీ బుగ్గ ప్రాంతం లో కొనసాగుతున్న వాల్వ్ మరమత్తు పనులు....

మన మీ వార్త నవంబర్ 13 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

జి డబ్ల్యు ఎం సి 13 నవంబర్ 2026 :వరంగల్ పరిధి కాశీ బుగ్గ ప్రాంతం లో వాల్వ్ కు మరమ్మత్తు పనులు కొనసాగుతున్న దృష్ట్యా శనివారం (నేడు) వరంగల్ పరిధి లోని కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరా ను ను నిలిపివేస్తున్నట్లు బల్దియా ఈ ఈ సంజయ్ కుమార్ నేడోక ప్రకటన లో తెలియజేశారు.

ఈ సందర్భం గా ఇట్టి పైప్ లైన్ పరిధి లోని ప్రాంతలైన చార్ బౌలీ, గోవిందరాజుల గుట్ట, (జీ ఆర్ గుట్ట)కాశీబుగ్గ, ఎస్ ఆర్ టి, క్రిస్టియన్ కాలనీ, ప్రతాప్ కాలనీ,ఓ సిటీ ప్రాంతాల్లో ఒక రోజు నీటి సరఫరా జరగదని సదరు ప్రాంత వాసులు సహకరించాలని ఈ ఈ కోరారు.

ప్రజల సమస్యలే ఎజెండాగా బిజెపి కార్యకర్తలు నిరంతరం పోరాడాలి.

-కార్యకర్తలే పార్టీకి వెన్నెముక.

- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

మన మీ వార్త నవంబర్ 13 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.





-రాబోయే వరంగల్ మున్సిపల్ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలి.
-బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి
బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్.

భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా శివనగర్ మండల కార్యవర్గ సమావేశం ఈరోజు మండల అధ్యక్షుడు మహమ్మద్ రఫీ గారి అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ..
-కార్యకర్తలు కేవలం సమావేశాలకే పరిమితం కాకుండా కింది స్థాయిలో ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ చేరవేయాలని సూచించారు.
-రాబోయే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే ప్రతి కార్యకర్త సైనికుడిలా సిద్ధంగా ఉండాలని, బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు.
-ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి పరిష్కారం కోసం అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. ప్రతిపక్షాల వైఫల్యాలను ఎండగడుతూ ప్రజా పక్షాన నిరంతరం పోరాడాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

అనంతరం మండల అధ్యక్షుడు మహమ్మద్ రఫీ గారు మాట్లాడుతూ, జిల్లా నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు శివనగర్ మండలంలో పార్టీ బలోపేతానికి, రాబోయే ఎన్నికల్లో బిజెపి విజయానికి ప్రతి ఒక్కరం సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మార్తా ఉషారాణి, మండల ప్రధాన కార్యదర్శి వైట్ల గణేష్, బిజెపి జిల్లా నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్, బోడకుంట్ల శివశంకర్, జన్ను ప్రభాకర్, జారతి దేవక్క, తోట సాగరిక, డివిజన్ కన్వీనర్లు పోషాల సతీష్, తమ్మిశెట్టి క్రాంతి కుమార్, సూరజ్ మరియు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిజామాబాద్ జిల్లా అగ్నిమాపక సేవల సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

(మన మీ వార్త న్యూస్) : నవంబర్ 13, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-





తెలంగాణ రాష్ట్ర అగ్నిమాపక, అత్యవసర సేవల సంఘం నిజామాబాద్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అగ్నిమాపక శాఖ ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు సంఘం ప్రతినిధులు వెల్లడించారు.

జిల్లా కార్యవర్గం ఇదే..

తెలంగాణ రాష్ట్ర అగ్నిమాపక, అత్యవసర సేవల సంఘం నిజామాబాద్? అధ్యక్షుడుగా పి. వంశీకృష్ణ రెడ్డి (బోధన్), ?వర్కింగ్ ప్రెసిడెంట్లుగా కె. ప్రశాంత్ గౌడ్, ఎ. సుధాకర్, ?ప్రధాన కార్యదర్శిగా ఈ.రంజిత్ (బాల్కొండ), ?సంయుక్త కార్యదర్శులుగా బి. సురేష్ (నందిపేట్), కె. సురేందర్ (నిజామాబాద్), ?కోశాధికారిగా ఇ. సాయిలు (నిజామాబాద్), ?ఆర్గనైజింగ్ సెక్రటరీగా టి. యేసురత్నం (నిజామాబాద్) ఎన్నికయ్యారు.

రాష్ట్ర తాత్కాలిక కార్యవర్గంలో జిల్లా ప్రతినిధులు:

రాష్ట్రస్థాయి తాత్కాలిక కార్యవర్గంలోనూ నిజామాబాద్ జిల్లాకు చెందిన పలువురికి కీలక బాధ్యతలు అప్పగించారు. రాష్ట్ర అధ్యక్షుల సలహాదారుగా దామోదర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పి. శ్రీనివాస్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్. ఆనంద్, రాష్ట్ర కోశాధికారిగా కె. కృష్ణ నియమితులయ్యారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి..

ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పదోన్నతులు, సీనియారిటీ, సర్వీస్ నిబంధనలు, ఉద్యోగ భద్రత వంటి అంశాల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. అగ్నిప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజల ఆస్తులు, ప్రాణాలను కాపాడుతున్న సిబ్బందికి తగిన గుర్తింపు, న్యాయం జరిగేలా పోరాడుతామని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని అగ్నిమాపక కేంద్రాల సిబ్బందిని ఒకే తాటిపైకి తెచ్చి, ఐక్యతతో ప్రతి ఉద్యోగికి అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.

గాజర్ల అశోక్ (ఐతు)కు మాజీ ఎమ్మెల్యే గండ్ర పరామర్శ



చిట్యాల నవంబర్ 13 మీవార్త

ఇటీవల అనారోగ్యానికి గురై గుండె ఆపరేషన్ చేయించుకుని గాజర్ల అశోక్ (ఐతు) ఇంటికి చేరుకున్న విషయాన్ని తెలుసుకున్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శుక్రవారం రోజున వారి నివాసానికి వెళ్లి అశోక్ (ఐతును) పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించి. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు.

ఈకార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్ , మండల యూత్ ప్రెసిడెంట్ తౌటం నవీన్, సీనియర్ నాయకులు పెరుమాండ్ల రవీందర్ గౌడ్. తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే భూపతిరెడ్డి



(మన మీ వార్త న్యూస్) : నవంబర్ 13, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-

కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై పార్టీలో చేరడం అభినందనీయమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. భూపతి రెడ్డి అన్నారు. శుక్రవారం డిచ్?పల్లి మండలం మిట్టపల్లి మాజీ సర్పంచ్ గణేష్, రాంపూర్ మాజీ ఎంపీటీసీ లక్ష్మి నారాయణ బీజేపీ పార్టీని వీడి కాంగ్రెస్?లో చేరారు.

ఐక్యంగా ఉండాలి

ఎమ్మెల్యే క్యాంప్? కార్యాలయంలో వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని.. ఆ వాస్తవాలను గుర్తించిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుండగా.. పార్టీ నాయకులు అందరూ ఐక్యంగా ఉంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ డిచ్?పల్లి మండల అధ్యక్షుడు అంబర్ సింగ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి పొలసాని శ్రీనివాస్, రామచందర్ గౌడ్, తారాచంద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు జీవనోపాదులను మెరుగుపరుచుకోవాలి

- మహిళలు అన్ని రంగాలలో ముందుండాలి: అనుముల
- శ్రీనివాస్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్



నవంబర్: 13,11,2026 పరకాల ప్రతినిధి మన మీ వారు

జయశంకర్ జిల్లా భూపాలపల్లి రేగొండ మండలం మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి మహిళా సాధికారిత ను పెంపొందించాలని ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రాజెక్ట్ బీసీఐ ప్రాజెక్టు కోఆర్డినేటర్ అనుముల శ్రీనివాస్ అన్నారు, రేగొండ మండల కేంద్రంలో ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం పియు మేనేజర్ నరిశెట్టి సాహితి ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రాజెక్టు కోఆర్డినేటర్ అనుముల శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ.... మహిళలు అన్ని రంగాలలో ముందుండి నైపుణ్యత ను సాధించి ఆర్థిక వృద్ధిని మెరుగుపరచడం మహిళ సాధికారిత ను సాధించడం, జీవనోపాదులను పెంపొందించడం కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు అంతేకాకుండా మహిళలు వ్యవసాయ రంగంలో కుటుంబ పోషణలో ముఖ్యపాత్ర వహించేది మహిళలేనని కొనియాడారు కుటుంబంలో చేదోడు వాదోడుగా నిలుస్తూ నిర్ణయాధికారం పురుషులతో సమానంగా నిలవాలని ప్రతి మహిళ ముందుండాలని అన్నారు, మహిళలకు వివిధ రంగాల సంస్థల భాగస్వామ్యంతో నైపుణ్యత శిక్షణలు ఏర్పాటు చేయడమే కాకుండా నైపుణ్యత ను వెలుగు తీయడం కొరకై ఇలాంటి టైలరింగ్, బ్యూటిషన్, జ్యూట్ బ్యాగ్ తయారీ శిక్షణ కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు మహిళలు జీవనోపాదులు మెరుగుపరచడం కొరకై మహిళలకు ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం అనునిత్యం ప్రోత్సహిస్తుందని అన్నారు అంతేకాకుండా నేర్చుకున్న టైలరింగ్ బ్యూటిషన్ వారికి ఉపయోగపడే సామాగ్రిని అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎం.ఐ. ఎస్ ఆఫీసర్ అక్కల రమేష్ రేగొండ సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు వారణాసి మౌనిక పంచాయతీ కార్యదర్శి మరియు వివిధ గ్రామ మహిళలు ప్రజ్వల్ క్షేత్ర సిబ్బంది తోటకూర సుజాత, రమాదేవి, చాంద్ పాషా,శ్రీహరి ,దీప, మౌనిక, రచన,మహేష్,దితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పత్తి ప్రభాకర్ను పరామర్శించారు

నవంబర్14,11,2026 పరకాల ప్రతినిధి మన మీ వార్త



హనంకొండ జిల్లా పరకాల రేగొండ మండలం మాజీ జెడ్పిటిసి పత్తి వినోద ప్రభాకర్ హనుమకొండ వాసవి క్లినిక్ హాస్పటల్లో చికిత్స పొందుతున్న ప్రభాకర్ పరామర్శించిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మరియు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గారు మరియు రేగొండ మండల పిఎసిఎస్ చైర్మన్ నడిపెల్లి విజన్ రావు కాకతీయ యూనివర్సిటీ జేఏసీ నాయకులు బండి శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు

హెచ్ఎంటీ నగర్, నాచారం డివిజన్లలో క్రైస్తవ చర్చిల అసోసియేషన్ల ఏర్పాటు

- నూతన పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం.. క్రైస్తవ సంఘాల ఐక్యత, సామాజిక సేవకు ప్రాధాన్యత ఇవ్వాలని నేతల పిలుపు

నాచారం, నవంబర్ 13 (మన మీ వార్త)

హెచ్ఎంటీ నగర్, నాచారం డివిజన్ల పరిధిలోని క్రైస్తవ చర్చిలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, వాటి మధ్య సమన్వయం, ఐక్యతను బలోపేతం చేయాలనే లక్ష్యంతో రెండు క్రైస్తవ చర్చిల అసోసియేషన్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, మేడల మల్లికార్జున్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు, కోశాధికారులు, సలహాదారులు ప్రమాణ స్వీకారం చేసి తమ బాధ్యతలను స్వీకరించారు.

----డివిజన్ 22 -- హెచ్ఎంటీ నగర్, రాఘవేంద్ర నగర్ అసోసియేషన్



నూతన పాలకమండలి అధ్యక్షుడిగా కుమ్మరి సామ్సన్, ఉపాధ్యక్షుడిగా స్వామి సూర్పంగ, ప్రధాన కార్యదర్శిగా కట్ట నీరజ, సంయుక్త కార్యదర్శిగా వల్లేపు ఏడుకొండలు, కోశాధికారిగా నల్ల ఉషాకిరణ్ ఎంపికయ్యారు. సలహాదారులుగా కొలియా స్టీఫెన్, మెదిద రవికాంత్ వ్యవహరించనున్నారు.

ఈ అసోసియేషన్ ఏర్పాటులో పాస్టర్ సురేష్, పాస్టర్ ప్రవీణ్, పాస్టర్ నెహెమ్యా తదితరులు స్థాపక సభ్యులుగా వ్యవహరించారు.

--డివిజన్ 21 -- నాచారం అసోసియేషన్

నూతన పాలకమండలి అధ్యక్షుడిగా రెవ. విలియం, ఉపాధ్యక్షుడిగా పాస్టర్ మహేష్, కార్యదర్శిగా రెవ. డాక్టర్ లాజరస్, సంయుక్త కార్యదర్శిగా పాస్టర్ హేమంత్, కోశాధికారిగా పాస్టర్ అభిషేక్ బాధ్యతలు స్వీకరించారు. సలహాదారులుగా రెవ. దొడ్ల విల్సన్, రెవ. ఎఫెన్, పాస్టర్ ప్రసాద్, పాస్టర్ పాల్, పాస్టర్ తిమోతి, పాస్టర్ సైమన్, ఆశా జ్యోతి, పాస్టర్ జోసెఫ్ వ్యవహరించనున్నారు.

ఈ సందర్భంగా నాయకులు నూతన పాలకమండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. క్రైస్తవ సంఘాల మధ్య ఐక్యతను పెంపొందించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక అభివృద్ధి, ప్రజల మధ్య సోదరభావాన్ని బలోపేతం చేయడంలో అసోసియేషన్లు కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

నూతన పాలకమండళ్ల ఆధ్వర్యంలో వివిధ చర్చిల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని, సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

రామరెడ్డి నగర్‌లో అర్ధరాత్రి విద్యుత్ ప్రమాదం తక్షణమే స్పందించిన ఆకారపు అరుణ్ పటేల్

- లారీ ఢీకొనడంతో కూలిన విద్యుత్ స్తంభం.. కిందపడిన 11 కేవీ హైటెన్షన్ వైర్లు.. విద్యుత్ సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేయించిన యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు

రామంతపూర్, నవంబర్ 13 (మన మీ వార్త):

రామరెడ్డి నగర్‌లో అర్ధరాత్రి జరిగిన విద్యుత్ ప్రమాదంపై ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్ పటేల్ తక్షణమే స్పందించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టారు. రామరెడ్డి నగర్‌లోని మల్లన్న టెంపుల్ సమీపంలో వేగంగా వచ్చిన లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో స్తంభం కూలిపోయి 11 కేవీ హైటెన్షన్ మెయిన్ విద్యుత్ వైర్లు రోడ్డుపై పడిపోయాయి. దీంతో ఆ ప్రాంతంలో తీవ్ర ప్రమాదకర పరిస్థితి నెలకొంది.

ఈ విషయాన్ని గుర్తించిన స్థానిక కాలనీవాసులు వెంటనే ఆకారపు అరుణ్ పటేల్‌కు సమాచారం అందించారు. అర్ధరాత్రి అయినప్పటికీ ఆయన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి అత్యవసరంగా విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ కూలిపోయిన విద్యుత్ స్తంభం, తెగిపడిన వైర్ల మరమ్మతు పనులు చేపట్టించి ప్రమాదాన్ని నివారించేందుకు చర్యలు తీసుకున్నారు.

అదేవిధంగా నిర్లక్ష్యంగా, అతివేగంగా లారీ నడిపి విద్యుత్ స్తంభం కూలిపోవడానికి కారణమైన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖకు ఫిర్యాదు చేయించారు.





ఈ సందర్భంగా ఆకారపు అరుణ్ పటేల్ మాట్లాడుతూ ప్రజల భద్రతే తమకు ప్రథమ ప్రాధాన్యత అని, కాలనీవాసులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి సమయంతో సంబంధం లేకుండా అందుబాటులో ఉంటామని తెలిపారు. ఆపద సమయంలో ప్రజలకు అండగా నిలవడమే తమ బాధ్యతని పేర్కొన్నారు. అర్ధరాత్రి వేళ స్పందించి ప్రమాద నివారణకు కృషి చేసిన అరుణ్ పటేల్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

భూపాలపల్లి ఎంఎస్ఎఫ్ నూతన మండల కమిటీ ఎన్నిక





జయశంకర్ భూపాలపల్లి జిల్లా నవంబర్ 13 (మన మీ వార్త)

పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బిఎంఎస్ ఆఫీసులో దోర్నాల రాజేందర్ మాదిగ ఎమ్మార్పీఎస్ కో ఇన్చార్జ్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయగా ఎమ్మెస్ ఎఫ్ భూపాలపల్లి జిల్లా ఇన్చార్జి మడిపల్లి సుమన్ మాదిగ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికిముఖ్య అతిథి మడిపెల్లి శ్యాంబాబు ఎంఎస్పి ఎమ్మార్పీఎస్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇంచార్జి ఏక్ శంకర్ మాదిగ,ఎమ్మార్పీఎస్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇన్చార్జిఅంబాల చంద్రమౌళి మాదిగఎంఎస్పి జిల్లా కో ఇన్చార్జిఎంఎస్పి రాష్ట్ర నాయకులు హాజరై మాట్లాడుతూ అసమానతలు లేని సమాజం నిర్మించటం కోసం అలాగే విద్యార్థి దశ నుండే ఈ సమాజానికి సేవ చేసే విధంగా విద్యార్థులు నేటి విద్యార్థులు భారత దేశ బావి భారత పౌరులుగా ఎదగాలని అన్నారు. అనంతరం ఎమ్మెస్ పి భూపాలపల్లి నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎంఎస్పిభూపాలపల్లిమండల అధ్యక్షులు నెరుపటి ఆదర్శ మాదిగ, అధికార ప్రతినిధి మామిడి రంజిత్ మాదిగ,ఉపాధ్యక్షులు కాసిపేట జోసెఫ్ మాదిగ, ఉపాధ్యక్షులు మడికొండ సూర్య వర్మ,ప్రధానకార్యదర్శి మెరుపటి అజయ్ మాదిగ, సహాయ కార్యదర్శి దాసరపు కిరణ్,కోశాధికారి చిర్ర కార్తీక్ మాదిగ,ఈ సమావేశంలోఎంఎస్పి జిల్లా సీనియర్ నాయకులునోముల శ్రీనివాస్ మాదిగ,

ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు అంతడుపుల సురేష్ మాదిగ,మిరపటి అశోక్ మాదిగ,మామిడి రవి మాదిగ, ములుగురి రవీందర్ మాదిగ, ఎంఎస్పి మండల అధ్యక్షులు ఓనపాకల కుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ అంబాల కవిశ్వర్ మాదిగ, బట్టు విజయ మాదిగ,కళ్ళపెల్లి తిరుపతి మాదిగ,

భూపాల్ పల్లి మండల ఎంఎస్ఎఫ్ నాయకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు 100 శాతం ఫీజు రాయితీ కల్పించాలి

- ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఉత్తర్వులు అమలు చేయాలి..
- టీయూడబ్ల్యూజే (ఐజేయూ) అధ్యక్ష కార్యదర్శులు కొండూరు రవీందర్, వెంక గారి భూమయ్య డిమాండ్

నిర్మల్ జిల్లా, నవంబర్ 13(మీ వార్త)

వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో 100 శాతం ఫీజు రాయితీ కల్పించాలని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే, ఐజేయూ)నిర్మల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండూరు రవీందర్, వెంక గారి భూమయ్య డిమాండ్ చేశారు.

శుక్రవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో పలు అంశాలపై తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలని జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి ద్వారా జారీ చేసిన ఆదేశాలను ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత ఉత్తర్వులను వెంటనే అమలు చేసి జర్నలిస్టుల పిల్లలకు 100 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరారు. ఈ విషయంలో మరోసారి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. విద్యాహక్కు చట్టం అమలు చేస్తున్నామని చెప్పుకుంటున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ విషయంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నాయని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆదేశాలను గౌరవించి జర్నలిస్టుల కుటుంబాలకు న్యాయం చేయాలని సూచించారు.

అలాగే ఈ నెల 25వ తేదీన తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ నిర్మల్ జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ మహాసభలను విజయవంతం చేసేందుకు జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యులు గాండ్ల



రాజశేఖర్, జిల్లా కోశాధికారి వీ. ప్రశాంత్, సామాజిక మాధ్యమాల విభాగం కన్వీనర్ యోగేష్, జిల్లా ఉపాధ్యక్షులు గుమ్ముల అశోక్, వేణుగోపాల్, తక్కల రవీందర్, జిల్లా సంయుక్త కార్యదర్శి హసుమాన్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిన్పల్లి రవి, పూర్ణచంద్, షిండే మహేష్, డీఎస్ మధు, ప్రసాద్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ సేద్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలి

- పంట మార్పిడి, ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలి: జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

నిర్మల్ జిల్లా నవంబర్ 13 (మీ వార్త)

పంటల సాగులో నీటి వినియోగాన్ని తగ్గించి, అధిక దిగుబడులు సాధించేలా సూక్ష్మ సేద్య పద్ధతులను రైతులు అవలంబించేలా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు.
శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయం, విద్య, వివి-జీ రామ్ జీ, భూసేకరణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. రైతులు పంట మార్పిడి విధానాన్ని అనుసరించేలా చర్యలు తీసుకోవాలని, తక్కువ నీటితో సాగయ్యే పంటలకు ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. సూక్ష్మ సేద్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి, ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందేలా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయడంతో పాటు రైతుల వివరాల నమోదు పూర్తి చేయాలని, కొనుగోళ్లను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సన్నధాన్యం సాగు చేసిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందేలా చూడాలన్నారు.
ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఎఫ్ఆర్ఎస్ హాజరు విధానాన్ని



పకడ్బందీగా అమలు చేయాలని, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును ప్రతిరోజూ పర్యవేక్షించాలని సూచించారు. సమగ్ర శిక్షా అభియాన్, పీఎం శ్రీ పథకాల నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలని, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు.
వీధి కుక్కల నియంత్రణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో వాటిని గుర్తించి నిబంధనల ప్రకారం పునరావాస కేంద్రాలకు తరలించాలని తెలిపారు. ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వివి-జీ రామ్ జీ పథకం కింద నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యతనిస్తూ, జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఆదేశించారు.
కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ.. జిల్లాలో ఉద్యానవన పంటల సాగును విస్తృతంగా ప్రోత్సహించాలని, సూక్ష్మ సేద్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి, ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.
అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వందశాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని, పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. సమగ్ర శిక్షా అభియాన్, పీఎం శ్రీ పథకాల నిధులను సమర్థవంతంగా వినియోగించాలన్నారు. వివి-జీ రామ్ జీ పథకం కింద నీటి సంరక్షణ పనులను చేపట్టి, భవిష్యత్తులో నీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు వెంకట మాధవ రావు, రాథోడ్ రమేష్, డీఈఓ భోజన్న, డీపీఓ శ్రీనివాస్, సీపీఓ గంగారెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి రమణ, ఈఈ ఆర్‌డబ్ల్యూఎస్ సందీప్, నీటిపారుదల శాఖ అధికారులు రాజేంద్రప్రసాద్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రబీ సీజన్ లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి :: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

- వరి సాగుకు బదులుగా ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్, సూక్ష్మ సేద్యానికి ప్రోత్సాహం

- విద్యార్థుల హాజరు 90 శాతానికి పెంచాలి

- ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు పర్యవేక్షణ

మన మీ వార్త నవంబర్ 13 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి
సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి
వ్యవసాయం, విద్య, భూసేకరణ, వీధి కుక్కల నియంత్రణ, ఎడీ+=వావీ+ పనులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎస్
వరంగల్ జిల్లా నవంబర్ 13,2026
రబీ 2026-27 సీజన్ లో ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేని నేపథ్యంలో వరి సాగును నివారించి,పండ్లు, కూరగాయలు, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు.
ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ సాగు, సూక్ష్మ సేద్యం పై రైతులకు అవగాహన కల్పించాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కలెక్టర్లకు ఆదేశించారు.
శుక్రవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక, విద్యాశాఖ, భూసేకరణ, వీధి కుక్కల నియంత్రణ, ఎడీ+=వావీ+ పనుల పురోగతిపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు
జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ నుండి
జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.
రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ,రబీ 2026-27 సీజన్‌లో ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేనందున వరి సాగును నివారించాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించేందుకు ఇదే సరైన సమయమని తెలిపారు. ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ సాగు, సూక్ష్మ సేద్యానికి ప్రాధాన్యతనిస్తూ రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.
పంటల వైవిధ్యీకరణ, ఖరీఫ్ పంటల ఉత్పాదకత పెంపు, రైతు ఐడీ నమోదు, కస్టమ్ హైరింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను పూర్తి స్థాయిలో వినియోగించుకుంటూ, ప్రత్యామ్నాయ పంటలు, వాటికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాల పై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు.
ప్రస్తుతం ప్రైవేటు మార్కెట్ లో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని సీఎస్



సూచించారు. రైతులు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం విక్రయించినప్పటికీ కనీస మద్దతు ధరతో పాటు ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కనీస మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం విక్రయించి రైతులు నష్టపోయే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను కొనుగోళ్లకు సిద్ధంగా ఉంచాలని, రైతులందరి వివరాల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా జరిగేలా కలెక్టర్లు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు.
విద్యార్థుల హాజరు 90 శాతానికి పెంచాలి
విద్యాశాఖ పై సమీక్షిస్తూ, పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది హాజరు పై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ సూచించారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరును పర్యవేక్షించాలని, ప్రతి పాఠశాలలో విద్యార్థుల హాజరు కనీసం 90 శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలల వారీగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని నిరంతరం సమీక్షించాలని తెలిపారు. ఉపాధ్యాయుల హాజరు మెరుగ్గా ఉంటే విద్యార్థుల హాజరు కూడా పెరుగుతుందని, విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరైతే వారి అభ్యసన సామర్థ్యాలు, విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.
విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచేందుకు ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ వంటి డిజిటల్ అభ్యసన వేదికలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.
విద్యా సంస్థల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి
రూసా 2.0, పీఎం ఉషా పథకాల కింద మొత్తం 41 పనులు మంజూరు కాగా, ఇప్పటివరకు 8 పనులు పూర్తయ్యాయని, మరో 33 పనులు పురోగతిలో ఉన్నాయని సీఎస్ తెలిపారు. మంజూరైన నిధుల్లో ఇప్పటివరకు 41 శాతం మాత్రమే ఖర్చు చేసినందున, మిగిలిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించి పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.
సమగ్ర శిక్ష అభియాన్, పీఎం శ్రీ పథకాల కింద మంజూరైన నిధులను కూడా పూర్తిస్థాయిలో వినియోగించాలని సూచించారు.



రాష్ట్రవ్యాప్తంగా రూ.11 వేల కోట్ల వ్యయంతో 87 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, ఇప్పటివరకు రూ.625 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఈ పనులను కలెక్టర్లు క్రమం తప్పకుండా సమీక్షిస్తూ వేగవంతం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా రూ.1,108 కోట్లతో మంజూరైన 115 తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణకు అత్యంత ప్రాధాన్యత
ప్రభుత్వ అభివృద్ధి పనులు, ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని సీఎస్ సంజయ్ జాజు సూచించారు.
భూసేకరణ కోసం అవసరమైన నిధులను కలెక్టర్ల వద్ద అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నిర్దిష్ట గడువులోగా భూసేకరణ పూర్తి చేసి ప్రాజెక్టుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అవసరమైతే భూసేకరణ కు అదనపు నిధులు కూడా మంజూరు చేస్తామని తెలిపారు.
వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలి
గ్రామాలు, పట్టణాల్లో వీధి కుక్కల సమస్యను సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించాలని సీఎస్ సూచించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఇతర జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో వీధి కుక్కలను గుర్తించి, నిబంధనల ప్రకారం వాటిని పునరావాస కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
ఎడీ+=వావీ+ ద్వారా నీటి సంరక్షణ పనులు చేపట్టాలి
ఎడీ+=వావీ+ పథకం కింద చేపట్టే పనులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, నీటి సంరక్షణ నిర్మాణాల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సీఎస్ సూచించారు.
గ్రామాల్లో నీటి సంరక్షణకు ఉపయోగపడే నిర్మాణాలను విస్తృతంగా చేపట్టాలని, అన్ని కాలువలను శుభ్రం చేసి అవసరమైన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్ , డియార్వో విజయలక్ష్మి జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి , సిపివో చంద్రకళ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం...వొడితల ప్రణవ్...

- వీణవంక మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇంటి నూతన గృహ ప్రవేశానికి హాజరైన ప్రణవ్..

- కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమానికి కౌశిక్ రెడ్డి హాజరవ్వడం పై ప్రణవ్ ఆసక్తికర వ్యాఖ్యలు..

మన మీ వార్త హుజూరాబాద్ ప్రతినిధి నవంబర్ 13

పదేళ్లలో రాష్ట్రంలో ఇళ్ల విషయంలో గత ప్రభుత్వం ఇవ్వకుండా ఆపిన వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీల్లో ప్రధానంగా ఇందిరమ్మ ఇంటి హామీని నెరవేరుస్తూ అర్హులైన లబ్ధిదారులకు ఇంటిని కేటాయిస్తూ సొంతింటి కలను నెరవేరుస్తూ వారి కళ్లలో ఆనందం చూస్తున్నామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.శుక్రవారం రోజున వీణవంక మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుని నూతన గృహ ప్రవేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.గత 30 సంవత్సరాలుగా సొంతింటి కల కోసం ఎదురుచూస్తున్నామని,ఆ కలను నెరవేరుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇంచార్జి వొడితల ప్రణవ్ మాకు ఇందిరమ్మ ఇంటిని కేటాయించి ఆర్థిక భరోసా కల్పించారని ఇప్పుడు కొత్త ఇంటిలోకి గృహప్రవేశం చేస్తుంటే ఆనందానికి అవధులు లేవని లబ్ధిదారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎక్కడా అని ప్రశ్నించే కౌశిక్ రెడ్డి ఈ రోజు తను రిబ్బన్ కట్ చేసిన ఇందిరమ్మ ఇళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని,ఇందిరమ్మ ఇళ్ల రిబ్బన్ కట్ చేసే సమయంలో లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం కౌశిక్ రెడ్డి చూడాలని కోరారు.పదేళ్ల పాటు హుజురాబాద్ నియోజకవర్గంలో ఒక్క ఇళ్లు కూడా కేటాయించకుండా లబ్ధిదారులను మభ్య పెట్టారని అన్నారు.మొదటి విడతతో పాటు రెండవ విడతలో మరిన్ని ఇళ్లు ఇచ్చి ఆదుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు,మండల అధ్యక్షుడు,మైనారిటీ నాయకులు,సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





జలమండలి మీటర్ రీడర్లకు కేటగిరీ--2 వేతన విధానం అమలుకు మార్గం సుగమం

- జీఓ నంబర్ 60 ప్రకారం 19,500 కేటగిరీని ప్రస్తుత టెండర్‌లో చేర్చిన అధికారులు.. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఐక్య పోరాటానికి లభించిన విజయం

హైదరాబాద్, నవంబర్ 13 (మన మీ వార్త):



తెలంగాణ రాష్ట్ర జలమండలిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ మీటర్ రీడర్ల హక్కుల సాధనలో కీలక ముందడుగు పడింది. ప్రస్తుత మీటర్ రీడర్ల నియామక టెండర్‌లో ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 60 ప్రకారం కేటగిరీ--2 కింద రూ.19,500 వేతనాన్ని చేర్చాలన్న తెలంగాణ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఐక్య కార్యాచరణ సమితి (టీజేఏసీ) నిరంతర కృషి ఫలించింది. జలమండలి ఉన్నతాధికారులతో జరిపిన చర్చలు సానుకూల ఫలితాన్ని ఇవ్వడంతో ఈ అంశాన్ని ప్రస్తుత టెండర్‌లో చేర్చినట్లు సమితి ప్రతినిధులు వెల్లడించారు.ఈ అంశంపై ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, తెలంగాణ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు మొగ్గుల రాజిరెడ్డి, రాఘవేంద్ర రాజ్, తెలంగాణ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్, అధ్యక్షుడు పుల్లి లక్ష్మయ్య, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మందాల బాలకృష్ణ రెడ్డి తదితరులు కలిసి జలమండలి బోర్డు అధికారులతో చర్చలు జరిపారు. వారి విజ్ఞప్తులకు అధికారులు సానుకూలంగా స్పందించి, కేటగిరీ--2 కింద రూ.19,500 వేతనాన్ని టెండర్‌లో పొందుపరిచినట్లు తెలిపారు.ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఐక్యతకు, సమితి చేసిన నిరంతర పోరాటానికి ఈ ఫలితం నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు. ఈ విజయానికి సహకరించిన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మొగ్గుల రాజిరెడ్డి, రాఘవేంద్ర రాజ్, పుల్లి లక్ష్మయ్య, మందాల బాలకృష్ణ రెడ్డి, జలమండలి అధికారులతో పాటు సహకరించిన ఉద్యోగులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
మరణించిన మీటర్ రీడర్ కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం కోరుతూ..
కేటగిరీ--2 వేతన విధానం సాధనతో పాటు మరో రెండు ప్రధాన డిమాండ్లను జలమండలి యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని సమితి కోరింది.
జలమండలి నూతన విభాగం--2 పరిధిలోని నేరేడ్‌మెట్ విభాగం, అల్వాల్ సర్కిల్‌లో విధులు నిర్వహించిన మీటర్ రీడర్ జి. మల్లేశ్ మరణించడంతో ఆయన కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో పడిందని పేర్కొంది. ఆయన కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం మంజూరు చేయడంతో పాటు, అర్హులైన కుటుంబ సభ్యుల్లో ఒకరికి నైపుణ్య ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేసింది.
మీటర్ రీడర్ పోస్టులకు అధికారిక మంజూరు కల్పించాలి
జలమండలిలో ఎన్నో సంవత్సరాలుగా ప్రజలకు సేవలందిస్తున్న మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు ప్రత్యేకంగా అధికారిక ఉద్యోగ స్థానాలను మంజూరు చేయాలని కోరింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు, అధికారిక లేఖలను ప్రభుత్వానికి తక్షణమే పంపించి, ప్రక్రియను వేగవంతం చేయాలని బోర్డు యాజమాన్యాన్ని విజ్ఞప్తి చేసింది.ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల హక్కులు, ఉద్యోగ భద్రత, వారి కుటుంబాల భవిష్యత్తు కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని టీజేఏసీ నాయకులు స్పష్టం చేశారు. కేటగిరీ--2 వేతన సాధనలో సాధించిన ఐక్యతతో మిగిలిన డిమాండ్లను కూడా సాధించేందుకు ఉద్యోగులంతా కలిసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఉద్యోగుల ఐక్యతే బలం.. ఐక్య పోరాటమే విజయం అని నాయకులు పేర్కొన్నారు.

పెద్దాపూర్‌లో కొలాం గిరిజనులకు ఆధార్ సేవలు

- కొత్త ఆధార్ కార్డుల జారీ, పాత కార్డుల సవరణకు ప్రత్యేక కేంద్రం

కాసిపేట, నవంబర్ 13:(మన మీ వార్త మండల ప్రతినిధి)



దేవాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని పెద్దాపూర్ పాఠశాలలో పీవీటీజీ కొలాం గిరిజనుల కోసం శుక్రవారం ప్రత్యేక ఆధార్ నమోదు, నవీకరణ కేంద్రాన్ని నిర్వహించారు. డీటీడీఓ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు ఆధార్ కార్డులు లేని వారిని గుర్తించి కొత్త కార్డుల నమోదుకు, ఆధార్ వివరాలు నవీకరించుకోని వారికి సవరణలు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ఆధార్ సేవలను వారి గ్రామానికి చేరువ చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.
ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, దేవాపూర్ సర్పంచ్ సిడం రాందాస్, పంచాయతీ కార్యదర్శి కవిత, ఎస్‌సీఆర్‌పీ పెంద్రం చందు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జలసిరి మరియు డ్రైయిన్ ఎండ్ సోక్ పిట్ పనులు గుర్తించిన ఎంపీడీవో కీర్తిరెడ్డి.

మనోహరాబాద్ నవంబర్ 13 మన మీ వార్త ప్రతినిధి.



మండలంలో మేజర్ గ్రామపంచాయతీ కాల్లకల్ గ్రామంలో ఎంపీడీఓ మరియు ఎంపీవో సర్పంచ్, మద్దూరి నవ్య నాగరాజ్ గౌడ్ ఉప-సర్పంచ్ వీరబోయిన ప్రవీణ్ కుమార్ వార్డు సభ్యులతో కలిసి జలసిరి పనులు మరియు డ్రైయిన్ ఎండ్ సోక్‌పిట్‌ను గుర్తించడానికి ట్రాన్సిట్ వాక్ నిర్వహించారు. అలాగే మహిళా భవన్‌ను,ఎంపీపీస్ పాఠశాలలో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ సోక్‌పిట్ మరియు బోర్‌వెల్ రీఛార్జ్ పాయింట్‌ను తనిఖీ చేసి ఎంపీపీస్ పాఠశాల విద్యార్థులతో పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని పిల్లలతో ఎంపీడీవో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

లీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం తహశీల్దార్ వసంతరావు

చిట్యాల నవంబర్13 (మీవార్త)



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే కార్యక్రమంలో భాగంగా చిట్యాల మండలం చల్లగారిగె గ్రామంలో చెరువు శిఖం భూముల హద్దుల నిర్ధారణ చేపట్టారు.
శుక్రవారం రోజున గ్రామంలోని ఊరకుంట చెరువు హద్దులను సర్వే సిబ్బంది గుర్తించి, హద్దుల నిర్ధారణ ప్రక్రియను చేపట్టారు.
ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ రీ సర్వేలో ప్రతి రైతు తప్పనిసరిగా పాల్గొని, తమ పట్టా భూముల హద్దులను అధికారులకు చూపించి సర్వే ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తహశీల్దార్ వసంతరావు సూచించారు. రీ సర్వే ద్వారా భూములకు సంబంధించిన సమస్యలు, సరిహద్దు వివాదాలు పరిష్కారమయ్యే అవకాశం ఉన్నందున రైతులందరూ సర్వే బృందానికి సహకరించాలని తహసిల్దార్ వసంతరావు కోరారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన నాగుర్ల...

నవంబర్14,11,2026 పరకాల ప్రతినిధి మన మీ వార్త



వరంగల్ జిల్లా పరకాల నియోజకవర్గం సంగెం మండలం నర్సానగర్ గణేష్ ఫర్టిలైజర్ (తిమ్మాపురం). శ్రీమతి శ్రీ ఉండిల సునీత శ్రీనివాస్ వారి కుమారుడు చిరంజీవి. రాజేష్ చిలాస. దివ్య . ల వివాహానికి హాజరై నూతన వధువరులను ఆశీర్వదించిన తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్ల గారు. కాంగ్రెస్ నాయకులు మాజీ కూడా చైర్మన్ ఇనుగాల వెంకాట్రామ్ రెడ్డి మరియు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు...

ప్రభుత్వ పాఠశాలకు,గ్రామ పంచాయతీకి పరిశ్రమ సౌజన్యంతో పరికరాల పంపిణీ



సర్పంచ్ యాదగిరి కి పరికరాలు అందజేస్తున్న ఎండి దేవేందర్ సురాణ

శివ్వంపేట మీ వార్త ప్రతినిధి నవంబర్ (13):

మండల పరిధిలోని శభాష్‌పల్లి గ్రామానికి స్థానిక టిరాయమిట్ పరిశ్రమ యాజమాన్యం చేయూతనందించింది. పరిశ్రమ ఎండీ దేవేందర్ సురాణ శుక్రవారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, గ్రామ పంచాయతీకి పలు పరికరాలను అందజేశారు. గ్రామ పంచాయతీకి కంప్యూటర్,వాటర్ ప్యూరిఫైయర్,బ్లూటూత్ పరికరాలతో పాటు ప్రభుత్వ పాఠశాలకు ఎల్ఈడీ టీవీని అందించారు. ఈ సందర్భంగా పరిశ్రమ ఎండీ దేవేందర్ సురాణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించడంతో పాటు గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి పరిశ్రమల యాజమాన్యాలు తమ వంతు సహకారం అందించాలని పేర్కొన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR)లో భాగంగా అందించిన ఈ పరికరాలు పాఠశాల విద్యార్థులకు, గ్రామ పంచాయతీకి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.

కార్తీక దీపోత్సవం అనంతరం భక్తులకు పసుపు,కుంకుమ, తాంబూలం,ప్రసాద వితరణ

శివ్వంపేట మీ వార్త ప్రతినిధి నవంబర్ (13):





మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా నిర్వహించిన కార్తీక దీపోత్సవ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో దీపారాధనలు నిర్వహించారు. దీపోత్సవ కార్యక్రమం అనంతరం పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో పసుపు, కుంకుమ, తాంబూలం, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. స్వామివారి ఆశీస్సులు అందరికీ కలగాలని భక్తులు ఆకాంక్షించారు.

దుబ్బ మల్లన్న కళ్యాణ, జాతర పోస్టర్ ను ఆవిష్కరించిన వొడితల ప్రణవ్..





మన మీ వార్త హుజూరాబాద్ ప్రతినిధి నవంబర్ 13

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని శ్రీ దుబ్బ మల్లికార్జున స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో వచ్చే నెల నుండి జరిగే మల్లికార్జున స్వామి కళ్యాణం,జాతరకు సంబంధించి పోస్టర్ ను ప్రణవ్ ఆవిష్కరించారు. ఎంతో మహిమ కలిగిన ఈ ఆలయంలో జరిగే జాతరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని,జాతరకు సంబంధించి అన్ని ఏర్పాట్లను చేయాలని కమిటీని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దుబ్బ మల్లన్న చైర్మెన్ రవీందర్,కౌన్సిలర్లు,కమిటీ సభ్యులు,ఆలయ అర్చకులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హనుమకొండ ప్రతి కుటుంబానికి 5 లక్షల జీవిత బీమా

భద్రత కల్పించడమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం లక్ష్యం

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- నవంబర్ 19న రాష్ట్రవ్యాప్తంగా పథకం ప్రారంభం..

మన మీ వార్త నవంబర్ 13 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

ప్రతి కుటుంబానికి పథకంపై విస్తృత అవగాహన కల్పించాలి
నవంబర్ 18న ప్రతి గ్రామంలో టాంటాం ద్వారా ప్రచారం
18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల కుటుంబ సంపాదన సభ్యుడికి రూ.5 లక్షల బీమా రక్షణ
దరఖాస్తుల సేకరణ, నామినీ వివరాల నమోదు, డిజిటలైజేషన్ పక్కాగా జరగాలి
ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఉప ముఖ్యమంత్రి

-తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.
శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజ్జు, రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు.
సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.
ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం తెలంగాణ ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమైన కార్యక్రమమని, దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించే లక్ష్యంతో ఈ పథకాన్ని రూపొందించామని తెలిపారు.
కులం, మతం, ఆదాయంతో సంబంధం లేకుండా తెలంగాణలోని ప్రతి కుటుంబం ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతుందని స్పష్టం చేశారు. ఇప్పటివరకు జీవిత బీమా పథకాలు కొన్ని నిర్దిష్ట వర్గాలకే పరిమితమయ్యాయని, రాష్ట్ర ప్రభుత్వ దార్శనికత మాత్రం ప్రతి కుటుంబం భద్రతతో జీవించాలనే లక్ష్యంతో ఉందన్నారు.
నవంబర్ 19న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక జిల్లాలో ఈ పథకాన్ని ప్రారంభిస్తారని, అదే రోజున రాష్ట్రవ్యాప్తంగా పథకం ప్రారంభమవుతుందని తెలిపారు.
నవంబర్ 14 నుంచి విస్తృత ప్రచారం చేపట్టాలి
భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా నవంబర్ 14 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. మిశ్రమ ఆర్థిక వ్యవస్థ, పంచవర్ష ప్రణాళికల ద్వారా దేశ అభివృద్ధికి బాటలు వేసిన నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఈ పథకం సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.
రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన కులగణన సర్వే ద్వారా అన్ని కుటుంబాల వివరాలు ప్రభుత్వానికి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నవంబర్ 19న ప్రతి గ్రామంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు





స్వీకరించాలని సూచించారు. కుటుంబ పెద్ద సూచించిన వ్యక్తిని నామినీగా నమోదు చేసుకోవచ్చని, ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మందిని నామినీలుగా ప్రతిపాదించే అవకాశం ఉంటుందని వివరించారు.
ప్రఓతి గ్రామం, ప్రతి వార్డులో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలి
ఈ పథకం అమలును దేశమంతా నిశితంగా గమనిస్తోందని, అధికారులు బాధ్యతతో వ్యవహరించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పథకాన్ని విజయవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు.
ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్వయంగా పథకం అమలు తీరును పర్యవేక్షిస్తారని తెలిపారు.
పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల అధికారులు, సిబ్బంది చురుగ్గా పనిచేస్తూ గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లోని వార్డుల వారీగా అవసరమైన నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు.
ప్రతి ఇంటికి ఈ పథకంపై సమాచారం చేరేలా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు.నవంబర్ 18న ప్రతి గ్రామంలో టాంటాం ద్వారా ప్రచారం నిర్వహించి, పథకం ఉద్దేశం, ప్రయోజనాలు, దరఖాస్తుల స్వీకరణ వివరాలను ప్రజలకు తెలియజేయాలన్నారు.
ఎలాంటి కుటుంబం ఈ పథకం గురించి తెలియక లబ్ధి పొందకుండా ఉండిపోకూడదని, రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి పథకం చేరేలా అధికారులు కృషి చేయాలని స్పష్టం చేశారు.
రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజ్జు మాట్లాడుతూ, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను కచ్చితత్వంతో సేకరించాలని, దరఖాస్తుల నమోదు ప్రక్రియను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని సూచించారు.
కుటుంబంలోని సంపాదన సభ్యుడికి జీవిత బీమా కల్పించే విధంగా 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల అర్హులైన వ్యక్తుల వివరాలను సేకరించాలని తెలిపారు. వయస్సు నిర్ధారణకు ఆధార్ కార్డులో నమోదైన పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు.
ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలతో పాటు బీమా పొందే వ్యక్తి పేరు, తండ్రి లేదా భర్త పేరు, లింగం, ఆధార్ నంబర్, మొబైల్ నంబర్, కుటుంబ సభ్యుల వివరాలు, వారి ఆధార్ నంబర్లు సేకరించాలని తెలిపారు.
దరఖాస్తులో జిల్లా, మండలం, గ్రామం లేదా పట్టణ వార్డు వివరాలు కూడా తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు.
నామినీ వివరాలను అత్యంత జాగ్రత్తగా నమోదు చేయాలని, ఒకరి కంటే ఎక్కువ మంది నామినీలను ప్రతిపాదించిన సందర్భంలో ప్రతి ఒక్కరి వాటా వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు.
నామినీ మైనర్ అయిన పక్షంలో అతని తరఫున నియమించిన గార్డియన్ లేదా ప్రతినిధి వివరాలను కూడా నమోదు చేయాలన్నారు.
ప్రతి దరఖాస్తులో అవసరమైన వివరాలు పూర్తిగా ఉండాలని, దరఖాస్తుదారుడి సంతకంతో పాటు సంబంధిత ధ్రువీకరణ అధికారి సంతకం కూడా ఉండేలా చూడాలన్నారు. వివరాల నమోదు, నామినీ వివరాల సేకరణలో ఎలాంటి తప్పులు జరగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు.
సంతకం చేసిన దరఖాస్తులను స్కాన్ చేసి డిజిటల్ విధానంలో బీమా సంస్థకు పంపించాలని సీఎస్ సూచించారు.
అసలు దరఖాస్తులను జిల్లా స్థాయిలో భద్రపరచాలని, భవిష్యత్తులో అవసరమైన పరిశీలన, ధ్రువీకరణ, క్లెయిమ్‌ల పరిష్కారానికి వీలుగా రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలన్నారు.
వచ్చే 15 నుంచి 20 రోజుల పాటు యుద్ధప్రాతిపదికన ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తులు, నామినీ వివరాలు సేకరించాలని ఆదేశించారు. ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలు డిజిటల్ వ్యవస్థలో సక్రమంగా నమోదయ్యేలా చూడాలని, ఏ ఒక్క కుటుంబం కూడా నమోదు ప్రక్రియలో మిగిలిపోకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు.
బీమా పొందిన వ్యక్తి మరణించిన సందర్భంలో నామినీకి రూ.5 లక్షల బీమా పరిహారం అందించే ప్రక్రియ సజావుగా జరిగేలా ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేయాలని సీఎస్ సూచించారు.
గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవో, సీపీఓ/డీఆర్డీఓ, జిల్లా కలెక్టర్ లేదా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సమన్వయంతో క్లెయిమ్‌ల పరిశీలన, ధ్రువీకరణ చేపట్టి బీమా సంస్థ ద్వారా నామినీకి పరిహారం అందేలా చూడాలన్నారు.
మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సీపీఓ/మెప్మా సంబంధిత అధికారులు సమన్వయంతో క్లెయిమ్‌ల ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు. మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డు అధికారులు, డిప్యూటీ కమిషనర్లు, మున్సిపల్ కమిషనర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించి క్లెయిమ్‌ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.
జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పర్యవేక్షణలో సీపీఓ, డీఆర్డీఓ, ఎంపీడీఓలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ కమిషనర్లు, మెప్మా అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్లెయిమ్‌లకు సంబంధించిన వివరాలు, పెండింగ్ దరఖాస్తులు, పరిష్కార పురోగతిని జిల్లా స్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డిఆర్డీఓ, సీపీఓ తదితరులు పాల్గొన్నారు

బీమారం మండలంలో టీ టిఫిన్ కుకింగ్ పాయింట్ లలో అక్రమంగా డొమెస్టిక్ గ్యాస్ వినియోగం !

- వాణిజ్య అవసరాలకు గృహావసర సిలిండర్ల మళ్లింపు.. ప్రభుత్వ నిబంధనలకు తూట్లు!
- ప్రభుత్వ సబ్సిడీ సొమ్ముకు గండి.. ప్రజల భద్రతకు ముప్పు!
- జగిత్యాల జిల్లా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందించాలి..
- ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి!

మన మీ వార్త నవంబర్ 13 స్టేట్ కో ఆర్డినేటర్ హైదరాబాదు

జగిత్యాల జిల్లా వేములవాడ నియోజకవర్గ భీమారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న హోటళ్లు, కుకింగ్ పాయింట్ సెంటర్ లు దాబాలు టిఫిన్ సెంటర్లు, టీ స్టాళ్లు, చిన్నచిన్న ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు.. ఇలా ఆహార వ్యాపారాలు నిర్వహించే అనేక వాణిజ్య సంస్థల్లో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల వినియోగంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గృహ అవసరాల కోసం ప్రభుత్వం అందించే 14.2 కేజీల సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించడం నిబంధనలకు విరుద్ధమైనప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో ఈ విధమైన వినియోగం అధికంగా జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సబ్సిడీ గ్యాస్ వాణిజ్య అవసరాలకు ఎలా?

సాధారణంగా గృహ వినియోగదారులకు 14.2 కిలోల డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను సరఫరా చేస్తారు. హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, టీ స్టాళ్లు వంటి వాణిజ్య సంస్థలకు మాత్రం కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను వినియోగించాల్సి ఉంటుంది. అయితే కమర్షియల్ గ్యాస్ ధర ఎక్కువగా ఉండటంతో కొందరు వ్యాపారులు తక్కువ ధరకు లభించే గృహావసర సిలిండర్లను వాణిజ్య అవసరాలకు మళ్లిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ సబ్సిడీ ప్రయోజనం దుర్వినియోగం కావడమే కాకుండా, నిబంధనలను పాటిస్తూ వ్యాపారం నిర్వహిస్తున్న వారికి అన్యాయం జరుగుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గ్యాస్ సిలిండర్ల తో ప్రమాదాలకు ఆహ్వానం!

చిన్నచిన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో పరిమిత స్థలంలో ఎక్కువ సంఖ్యలో గ్యాస్ సిలిండర్లను నిల్వ చేయడం, సరైన గాలి ప్రసరణ లేకుండా వినియోగించడం, నాణ్యత లేని పైపులు, రెగ్యులేటర్లు ఉపయోగించడం వంటి నిర్లక్ష్యాలు ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉంది.
గ్యాస్ లీకేజీ, అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వ్యాపారులతో పాటు అక్కడికి వచ్చే వినియోగదారులు, సమీప నివాసితుల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతుంది. అందువల్ల గ్యాస్ వినియోగంలో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి.

చట్టాలు ఏం చెబుతున్నాయి?

కేంద్ర ప్రభుత్వం రూపొందించిన Liquefied Petroleum Gas (Regulation of Supply and Distribution) Order, 2000 ప్రకారం వినియోగదారుడు తనకు ఏ ప్రయోజనం కోసం గ్యాస్ కనెక్షన్ మంజూరైందో అదే ప్రయోజనానికి వినియోగించాలి.
వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను మళ్లించడం నిబంధనలకు విరుద్ధం. అలాగే అత్యవసర వస్తువుల చట్టం, 1955 (Essential Commodities Act, 1955) లోని సెక్షన్ 7 ప్రకారం సంబంధిత నిబంధనల ఉల్లంఘనపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

అధికారుల తనిఖీలు ఎక్కడ?

జగిత్యాల జిల్లా పౌర సరఫరాల శాఖ, సంబంధిత గ్యాస్ కంపెనీల అధికారులు హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, టీ స్టాళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.
డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే నిబంధనల ప్రకారం సిలిండర్ల స్వాధీనం, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు





తీసుకోవాలి.
అక్రమంగా సిలిండర్లను సరఫరా చేస్తున్న ఏజెన్సీలు లేదా డెలివరీ బాయ్‌ల మధ్యవర్తుల పాత్ర ఉన్నట్లయితే వారిపైనా విచారణ జరిపించాలి రుజువైతే కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు

ప్రజల భద్రతే ప్రథమ ప్రాధాన్యత!

గ్యాస్ సిలిండర్ల వినియోగం అనేది కేవలం వ్యాపారానికి సంబంధించిన అంశం మాత్రమే కాదు. అది ప్రజల ప్రాణ భద్రతకు సంబంధించిన అత్యంత కీలకమైన విషయం. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ సబ్సిడీ గ్యాస్‌ను వాణిజ్య అవసరాలకు వినియోగించే వారిపై అధికారులు కఠినంగా వ్యవహరించాలి.
ప్రభుత్వ సబ్సిడీ దుర్వినియోగానికి అడ్డుకట్ట ఎప్పుడు? హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో తనిఖీలు ఎప్పుడు? సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందిస్తారా? అన్నది వేచి చూడాలి.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి పిట్టల సమ్మయ్య

మన మీ వార్త నవంబర్ 13 స్టేట్ కో ఆర్డినేటర్ హైదరాబాదు

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ బిల్డింగ్ కన్స్ట్రక్షన్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా లేబర్ అధికారి (డిసిఎల్) కొంటె ప్రసాద్ గారికి లేబర్ కార్యాలయం కలెక్టరేట్ లో వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి)జిల్లా ప్రధానకార్యదర్శి పిట్టల సమ్మయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి కార్మికులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



భవన నిర్మాణ కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ప్రధానంగా సంక్షేమ బోర్డులో అవినీతి అక్రమాలను అరికట్టి బోర్డులో సభ్యులుగా కార్మిక నాయకులను చేర్చుకోవాలని, ల్యాప్స్ అయిన కార్డులను పాత పద్ధతిలోనే కొనసాగించాలని, పెండింగ్ లో ఉన్న క్లైమ్ లను వెంటనే పరిష్కరించి కార్మిక లోకాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

భవన నిర్మాణ పనులు చేసి 50 సంవత్సరాలు దాటిన కార్మికునికి 5000 రూపాయల పెన్షన్ ఇవ్వాలని సహజ మరణానికి రెండు నుండి ఐదు లక్షల రూపాయల పెంచాలని ఆయన కోరారు.

మెటర్నిటీ, మ్యారేజ్ గిఫ్టును లక్ష రూపాయలకు పెంచాలన్నారు. ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలను రద్దు చేయాలన్నారు.

వినతి పత్రం అందజేసిన వారిలో జిల్లా అధ్యక్షులు గందె కొమురయ్య,జిల్లా కార్యవర్గ సభ్యులు రేగుల కుమార్, బత్తుల శ్రీనివాస్ ఐలవేణి రాజ్ కుమార్, రెడ్డి మొండయ్య, నాయకులు వీ రాజు,జి రాజయ్య, ఎం శ్రీనివాస్,ఏ శశి కుమార్,అరవింద్,సాగర్, తిరుపతి, రణధీర్, కే సంపత్ మహేష్,రాజు,రఘు లతోపాటు భవనిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు

35 ఏళ్లుగా గుడిసెల్లో నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

- బాధితుల పక్షాన పోరాడి 34 కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయించిన మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్.. లబ్ధిదారులతో గృహప్రవేశం

రామంతాపూర్, నవంబర్ 13 (మన మీ వార్త):

రామంతాపూర్ చెరువు కట్ట సమీపంలో గత 35 సంవత్సరాలుగా గుడిసెల్లో నివాసం ఉంటున్న గిరిజన కుటుంబాలకు న్యాయం జరిగేలా పోరాటం చేసి, 34 కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయించడంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ కీలక పాత్ర పోషించారు. ఆయన కృషితో ఇళ్లు పొందిన లబ్ధిదారులు గురువారం ఆనందోత్సాహాల మధ్య గృహప్రవేశాలు నిర్వహించి, ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.రామంతాపూర్ చెరువు సుందరీకరణ పనుల్లో భాగంగా చెరువు కట్టపై గుడిసెల్లో నివసిస్తున్న గిరిజన కుటుంబాలు తమ నివాసాలను కోల్పోయాయి. దీంతో బాధిత కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌ను ఆశ్రయించాయి. స్పందించిన ఆయన జిల్లా కలెక్టర్, హైడ్రా కమిషనర్, జీహెచ్ఎంసీ, హౌసింగ్ బోర్డు అధికారులను పలుమార్లు కలిసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. అర్హులైన కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించే వరకు అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పోరాటం కొనసాగించారు. చివరకు 34 కుటుంబాలకు ఇళ్లు మంజూరు కావడంతో లబ్ధిదారుల కల నెరవేరింది. ఈ సందర్భంగా ప్రభాకర్ స్వయంగా లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల కారణంగా నివాసాలు కోల్పోయిన పేదలకు ప్రత్యామ్నాయ పునరావాసం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నాచారం సింగం చెరువు తండాలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు అందజేసినట్లు గుర్తుచేశారు. అదేవిధంగా మల్లాపూర్‌లో నిర్మాణం పూర్తిచేసుకున్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులు కూడా తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే ప్రారంభించినవేనని తెలిపారు.నియోజకవర్గ పరిధిలో ఎక్కడెక్కడ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించారో వాటిని పరిశీలించి, ఖాళీగా ఉన్న ఇళ్లను అర్హులైన పేదలకు వెంటనే కేటాయించాలని అధికారులను కోరనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఇళ్లు కేటాయించిన చోట లబ్ధిదారులు నివాసం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో విద్యుత్, లిఫ్ట్, తాగునీరు వంటి కనీస మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు నిరంతరం పోరాడతానని హామీ ఇచ్చారు.ఇళ్లు పొందిన లబ్ధిదారులు వక్నవత్ హన్మంత్, మురళి, లచ్చిరాం, గోపి, కుమార్, హిమాల, నందు, పద్మ, నేనావత్ వాల్సి, శ్రీనివాస్, చేత్రు, మంజులా భాయ్ తదితరులు మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గౌరిగే కృష్ణ, బ్రహ్మచారి, మహంకాళి లక్ష్మణ్, రావుల బాలకృష్ణ గౌడ్, శ్రీనివాస శర్మ, జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్, సోమశేఖర్ గౌడ్, బాలచందర్, రవీందర్ రెడ్డి, పుష్పాల వెంకటేష్, శ్రీధర్ రెడ్డి, రాజిరెడ్డి, చంద్రమౌళి, హన్మంత్ బిరాదర్, ముత్యం రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, దొడ్డి యాదగిరి, నర్సింహా, గణేష్, కేశవరం యాదగిరి, బాబి, ఏఎస్ రావు నగర్ డివిజన్ అధ్యక్షురాలు సంధ్యారెడ్డి, జీవీఎన్ రావు, శ్రీధర్, హెచ్‌బీ కాలనీ డివిజన్ అధ్యక్షుడు రాంప్రదీప్, స్రవంతి, గోపు రాజేశ్వర్ పటేల్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







ప్రపంచ దేశాల చూపు బ్రహ్మోస్‌పైనే!

హైదరాబాద్: భారత రక్షణ రంగానికి గర్వకారణమైన బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణికి అంతర్జాతీయంగా డిమాండ్ పెరుగుతోంది. ఇప్పటికే ఫిలిప్పీన్స్ బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థను కొనుగోలు చేయగా, తాజాగా వియత్నాంతోనూ భారత్ ఒప్పందం కుదుర్చుకుంది. వీటితో పాటు ఆగ్నేయాసియాకు చెందిన మరికొన్ని దేశాలు కూడా ఈ క్షిపణి వ్యవస్థను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ఆయా దేశాలతో చర్చలు సానుకూలంగా సాగుతున్నాయని, కేంద్ర ప్రభుత్వ అధికారిక అనుమతులు లభించిన వెంటనే కొత్త ఎగుమతి ఒప్పందాలు ఖరారయ్యే అవకాశం ఉందని బ్రహ్మోస్ ఏరోస్పేస్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ జైతీర్థ్ ఆర్. జోషి వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ బ్రహ్మోస్ ఎగుమతులు, క్షిపణి పనితీరుపై పలు కీలక విషయాలు వివరించారు.



ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచవ్యాప్త గుర్తింపు

ఆపరేషన్ సిందూర్ తర్వాత బ్రహ్మోస్ క్షిపణి సామర్థ్యంపై అంతర్జాతీయంగా ఆసక్తి మరింత పెరిగిందని జైతీర్థ్ జోషి తెలిపారు. ఈ ఆపరేషన్‌లో వినియోగించిన కొన్ని క్షిపణులు 10 నుంచి 20 ఏళ్ల క్రితం తయారైనవని వెల్లడించారు. ఇన్నేళ్ల పాటు నిల్వ ఉంచినప్పటికీ, అవసరమైన సమయంలో అవి సమర్థవంతంగా పనిచేయడం వాటి నాణ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. క్షిపణుల దీర్ఘకాలిక పనితీరును నిర్ధారించడంలో నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ (చీణు) విధానం కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఈ పరీక్షల ద్వారా క్షిపణులకు ఎలాంటి నష్టం కలిగించకుండానే వాటి అంతర్గత పరిస్థితిని అంచనా వేయవచ్చని తెలిపారు.

అసలు ఎన్‌డీటీ పరీక్ష అంటే ఏమిటి?

నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ అంటే ఎలాంటి పరికరాన్ని లేదా దాని భాగాలను ధ్వంసం చేయకుండా, వాటి నాణ్యత, దృఢత్వం, పనితీరును పరిశీలించే పరీక్షా విధానం. ముఖ్యంగా రక్షణ, విమానయాన, అంతరిక్ష పరిశోధన రంగాల్లో దీనికి ఎంతో ప్రాధాన్యత ఉంది.

- లోపాల గుర్తింపు: పరికరాలను విడదీయకుండానే అంతర్గత లోపాలను గుర్తించవచ్చు.
- నాణ్యత పరిశీలన: లోహ భాగాలు, నిర్మాణాల్లో పగుళ్లు, బలహీనతలను గుర్తించవచ్చు.
- దీర్ఘకాలిక భద్రత: ఏళ్ల తరబడి నిల్వ ఉంచిన పరికరాల పరిస్థితిని అంచనా వేయవచ్చు.
- పనితీరు నిర్ధారణ: అవసరమైన సమయంలో వినియోగానికి అనువుగా ఉన్నాయో లేదో పరీక్షించవచ్చు.

క్షిపణులు, యుద్ధ విమానాలు వంటి అత్యాధునిక రక్షణ పరికరాలను దీర్ఘకాలం నిల్వ ఉంచాల్సి ఉంటుంది. అలాంటి సందర్భాల్లో ఎన్‌డీటీ పరీక్షలు వాటి విశ్వసనీయతను అంచనా వేయడానికి ఉపయోగపడతాయి.

బ్రహ్మోస్ క్షిపణి ప్రత్యేకతలివే!

భారత్‌కు చెందిన రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ), రష్యాకు చెందిన ఎన్‌పీఓ మషినోస్ట్రోయెనియా సంయుక్తంగా బ్రహ్మోస్ క్షిపణిని అభివృద్ధి చేశాయి. రెండు దశల్లో పనిచేసే ఈ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి అత్యంత వేగంతో లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం కలిగి ఉంది.

- వేగం: సుమారు మాక్ 2.8 వేగంతో ప్రయాణించగలదు.
- ఇంజిన్: సాలిడ్ ప్రొపెల్లెంట్ బూస్టర్, లిక్విడ్ ఫ్యూయెల్ రామ్‌జెట్ ఇంజిన్‌తో పనిచేస్తుంది.
- సాంకేతికత: అత్యాధునిక మార్గదర్శక వ్యవస్థతో నిర్దేశిత లక్ష్యాలను ఛేదించగలదు.
- వినియోగం: భూమి, సముద్రం, గగనతలం నుంచి ప్రయోగించే వివిధ రూపాల్లో అందుబాటులో ఉంది.
- ప్రత్యేకత: అధిక వేగం, తక్కువ ప్రతిస్పందన సమయం దీని ప్రధాన బలాలు.

భారత రక్షణ ఎగుమతులకు కొత్త అవకాశాలు

ప్రపంచ దేశాలు భారత రక్షణ ఉత్పత్తులపై ఆసక్తి చూపుతుండటం దేశీయ రక్షణ పరిశ్రమకు సానుకూల పరిణామంగా భావిస్తున్నారు. ముఖ్యంగా బ్రహ్మోస్ వంటి అత్యాధునిక క్షిపణి వ్యవస్థలకు విదేశీ మార్కెట్లలో ఆదరణ పెరగడం భారత్‌కు వ్యూహాత్మకంగానూ, ఆర్థికంగానూ ప్రయోజనకరంగా మారనుంది. ఫిలిప్పీన్స్, వియత్నాం తర్వాత మరిన్ని దేశాలతో ఎగుమతి ఒప్పందాలు కుదిరితే భారత రక్షణ ఉత్పత్తుల అంతర్జాతీయ స్థాయి మరింత పెరిగే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వ అనుమతులు, కొనసాగుతున్న చర్చల ఫలితాలపై తదుపరి ఒప్పందాల భవిష్యత్తు ఆధారపడి ఉంది.

దశదిన కార్యక్రమములో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా సీనియర్ నాయకులు



టేకుమట్ల నవంబర్ 13 (మన మీ వార్త)

టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన దాసరపు లింగయ్య దశదిన కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ నాయకులు హాజరై లింగయ్య చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించిన ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా నాయకులు రామ్ చందర్ మాదిగ అక్కల రాజయ్య మాదిగ రేణిగుంట్ల శంకర్ మాదిగ.తదనంతరం వారి కుటుంబ సభ్యులు వారి కుమారులైనటువంటి దాసారపు రవి దాసరపు సదానందం తో వారు ఆప్యాయంగా మాట్లాడి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. దాసరపు లింగయ్య కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. వారి కుటుంబానికి ఎమ్మార్పీఎస్ అండదండలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి మండల అధ్యక్షులు మాడుగుల వీరయ్య మాదిగ,ఎంఎస్పి గౌరవ అధ్యక్షులు అంబాలసారయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల సీనియర్ నాయకులు అక్కల భద్రయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

భారత్‌కు ఇంకా సంపూర్ణ ఆహార భద్రత లేదు!

న్యూఢిల్లీ: వ్యవసాయ రంగంలో భారత్ గణనీయమైన ప్రగతి సాధిస్తున్నప్పటికీ, ఆహార ఉత్పత్తుల సరఫరా విషయంలో ఇంకా సంపూర్ణ స్వయం సమృద్ధిని సాధించలేదని నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ అశోక్ కుమార్ లాహిరి అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా వంటనూనెల అవసరాల కోసం విదేశీ దిగుమతులపై ఎక్కువగా ఆధారపడటం దేశ ఆహార భద్రతకు సవాలుగా మారుతోందని పేర్కొన్నారు. భారత్ ప్రపంచంలోనే అత్యధికంగా వంటనూనెలను దిగుమతి చేసుకుంటున్న దేశమని గుర్తుచేశారు. శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, ఆహార ఉత్పత్తుల విషయంలో దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను వివరించారు.

వంటనూనెల దిగుమతులకే రూ.లక్షల కోట్ల వ్యయం

దేశీయంగా వంటనూనెల వినియోగం భారీగా ఉండటంతో అవసరాల్లో సగానికి పైగా దిగుమతుల ద్వారానే సమకూర్చుకోవాల్సి వస్తోందని లాహిరి తెలిపారు. ఏటా సుమారు 17 మిలియన్ మెట్రిక్ టన్నుల వంటనూనెలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని, ఇందుకోసం దాదాపు 20 బిలియన్ అమెరికన్ డాలర్లు వెచ్చిస్తున్నామని వెల్లడించారు. దేశీయంగా నూనెగింజల సాగు, ఉత్పత్తి పెంచాల్సిన అవసరాన్ని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని అభిప్రాయపడ్డారు.

పప్పుధాన్యాల వినియోగంలో భారత్‌దే అగ్రస్థానం

పప్పుధాన్యాల ఉత్పత్తి, వినియోగంలో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉందని అశోక్ కుమార్ లాహిరి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా వినియోగించే పప్పుధాన్యాల్లో దాదాపు నాలుగో వంతు భారత్‌లోనే వినియోగమవుతోందని పేర్కొన్నారు. దేశంలో ఏటా సుమారు 25 నుంచి 27 మిలియన్ టన్నుల పప్పుధాన్యాలను వినియోగిస్తున్నట్లు వివరించారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే వ్యవసాయ రంగంలోనూ సమగ్ర అభివృద్ధి సాధించాలని, అందులో భాగంగా 'వికసిత్ కృషి'కి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆహార ఉత్పత్తుల విషయంలో దేశం పూర్తిస్థాయి భద్రత సాధించిందా? అనే ప్రశ్నకు ప్రస్తుత పరిస్థితుల్లో లేదనే సమాధానం వస్తుందని వ్యాఖ్యానించారు.

విదేశాల నుంచి దిగుమతులపైనే ఆధారం

భారత్ పలు రకాల పప్పుధాన్యాలు, వంటనూనెల కోసం వివిధ దేశాలపై ఆధారపడుతోందని లాహిరి వివరించారు.

- శనగలు: ఆస్ట్రేలియా నుంచి దిగుమతి చేసుకుంటున్నాం.
- మసూర్ పప్పు: ఆస్ట్రేలియా, కెనడా నుంచి సరఫరా అవుతోంది.
- ఇతర పప్పుధాన్యాలు: మయన్మార్, ఆఫ్రికా, రష్యా నుంచి దిగుమతి అవుతున్నాయి.
- వంటనూనెలు: ఇండోనేషియా, మలేషియా, అర్జెంటీనా, బ్రెజిల్ తదితర దేశాల నుంచి వస్తున్నాయి.

దేశీయ అవసరాల కోసం విదేశాల నుంచి దిగుమతులు చేసుకోవడంలో తప్పేమీ లేదని, అయితే వాటిపై అతిగా ఆధారపడటం దీర్ఘకాలంలో సమస్యలకు దారితీయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

అంతర్జాతీయ సంక్షోభాలు వస్తే ధరల భారం

ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, వాణిజ్య ఆంక్షలు, వాతావరణ మార్పులు, రవాణా సమస్యలు వంటి పరిణామాలు అంతర్జాతీయ ఆహార సరఫరా వ్యవస్థను ప్రభావితం చేసే అవకాశం ఉందని లాహిరి హెచ్చరించారు. దిగుమతి చేసుకునే దేశాల్లో ఉత్పత్తి తగ్గినా, అంతర్జాతీయ మార్కెట్లో ధరలు ఒక్కసారిగా పెరిగినా భారత్‌పై దాని ప్రభావం తప్పదని పేర్కొన్నారు. ముఖ్యంగా వంటనూనెలు, పప్పుధాన్యాల ధరలు పెరిగితే దేశీయ మార్కెట్లో వినియోగదారులపై అదనపు భారం పడే ప్రమాదం ఉందన్నారు. సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే ఆహార భద్రతకు సవాళ్లు ఎదురవుతాయని వివరించారు.

స్వయం సమృద్ధి దిశగా వ్యవసాయానికి ప్రోత్సాహం అవసరం

దేశీయంగా నూనెగింజలు, పప్పుధాన్యాల సాగును విస్తరించడం, రైతులకు మెరుగైన విత్తనాలు, ఆధునిక సాగు పద్ధతులు అందించడం కీలకమని వ్యవసాయ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దిగుబడులను పెంచడంతో పాటు పంటల నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ సదుపాయాలను మెరుగుపరిస్తే దిగుమతులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించవచ్చు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న భారత్‌కు ఆహార భద్రత కూడా అత్యంత కీలకం. ఆహార ఉత్పత్తుల విషయంలో స్వయం సమృద్ధి సాధించినప్పుడే అంతర్జాతీయ పరిణామాలతో సంబంధం లేకుండా దేశీయ సరఫరా వ్యవస్థను స్థిరంగా ఉంచడం సాధ్యమవుతుంది.

'ఆపరేషన్ సిందూర్' ప్రైవేటు భద్రతా సిబ్బంది ప్రాధాన్యాన్ని చాటింది



దేశ రక్షణలో ప్రైవేటు భద్రతా సిబ్బంది కీలక పాత్ర పోషించాల్సిన అవసరాన్ని ఆపరేషన్ సిందూర్ నిరూపించిందని మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అన్నారు. వీరిలో ఎక్కువ మంది మాజీ సైనికులేనని, భవిష్యత్తులో జరిగే యుద్ధాల్లో సైన్యం, పోలీసు బలగాలతో పాటు వీరి పాత్ర కూడా అంతే ముఖ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. ఢిల్లీలో శుక్రవారం సెంట్రల్ అసోసియేషన్ ఆఫ్ ప్రైవేట్ సెక్యూరిటీ ఇండస్ట్రీ (క్యాప్సీ) నిర్వహించిన 21వ వార్షిక భద్రతా నాయకత్వ సదస్సులో ఆయన మాట్లాడారు. దేశంలో కోటి మందికి పైగా ప్రైవేటు భద్రతా సిబ్బంది 35 వేలకుపైగా సంస్థల్లో పనిచేస్తున్నారని ద్వివేది తెలిపారు. సాధారణ ప్రజలకు భద్రత అంటే ముందుగా కనిపించేది సైన్యం, పోలీసుల కంటే అపార్ట్‌మెంట్ గేటు వద్ద, బ్యాంకు ప్రవేశ ద్వారం వద్ద, ఆసుపత్రుల వద్ద విధులు నిర్వహించే సిబ్బందేనని చెప్పారు. విద్యుత్ కేంద్రాలు, బొగ్గు గనులు, పరిశ్రమలు, డేటా సెంటర్లు, ఓడరేవుల వంటి కీలక రంగాల్లోనూ వీరు భద్రత కల్పిస్తున్నారని వివరించారు.

ఆర్థిక న్యాయమే అభివృద్ధికి పునాది

-మొదటిపేజీ తరువాయి

సమానత్వం, సంక్షేమ విధానాలను అంతర్జాతీయ ప్రతినిధుల కు పరిచయం చేయడం ఈ చర్చల ప్రధాన ఉద్దేశం.

'ఫోర్జింగ్ ఏ న్యూ వరల్డ్' ఇతివృత్తంతో సదస్సు

ప్రపంచవ్యాప్తంగా మారుతున్న రాజకీయ, ఆర్థిక పరిస్థితులు, ప్రజాస్వామ్య పరిరక్షణ, అంతర్జాతీయ సహకారం, కృత్రిమ మేధ (ఏఐ), వాతావరణ మార్పులు వంటి కీలక అంశాలు భారత్ సమ్మిట్ ఎజెండాలో చోటుచేసుకున్నాయి. వివిధ దేశాలకు చెందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, విధాన నిర్ణేతలు, మేధావులు తమ అనుభవాలను, అభిప్రాయాలను ఈ వేదికపై పంచుకుంటున్నారు. ప్రపంచ సవాళ్లకు పరిష్కార మార్గాలను అన్వేషించడంతో పాటు భవిష్యత్ అభివృద్ధి దిశపై చర్చలు సాగుతున్నాయి.

పట్టణీకరణ.. ఫ్యూచర్ సిటీపై ప్రత్యేక చర్చ

తెలంగాణ రైజింగ్ పేరుతో నిర్వహించిన తొలి ప్యానల్ చర్చలో పట్టణీకరణ, భవిష్యత్ నగరాల నిర్మాణం, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రధానంగా చర్చించారు. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఈ చర్చలో పాల్గొని తెలంగాణ ప్రభుత్వం రూపొందిస్తున్న ఫ్యూచర్ సిటీ ప్రణాళికలను వివరించారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా రవాణా, నివాసం, పారిశ్రామిక మౌలిక వసతులు, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని ప్రతినిధులు ప్రస్తావించారు.

రెండో ప్యానల్ చర్చ ఆర్థిక న్యాయం అంశంపై జరిగింది. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు ఇందులో పాల్గొన్నారు. ఆర్థిక అసమానతలను తగ్గించడం, అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు అందించడం, సమాన అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై చర్చించారు. సంపద కొద్దిమందికే పరిమితం కాకుండా అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందేలా విధానాలు రూపొందించాల్సిన అవసరాన్ని చర్చకు తీసుకొచ్చారు.

సామాజిక న్యాయంపై మేధోమథనం

మూడో ప్యానల్ చర్చలో సామాజిక న్యాయం ప్రధాన అంశంగా నిలిచింది. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని తెలంగాణలో సామాజిక న్యాయం అమలు, వెనుకబడిన వర్గాలకు అవకాశాల కల్పనపై అభిప్రాయాలు



పంచుకున్నారు. బీసీలు, ఇతర సామాజికంగా వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరంపై చర్చ సాగింది.

సంక్షేమ పథకాలపై నాలుగో చర్చ

సంక్షేమం అంశంపై నిర్వహించిన నాలుగో ప్యానల్ చర్చలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఆయా వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. అట్టడుగు వర్గాలకు సంక్షేమ ఫలాలు చేరడంతో పాటు వారికి ఆర్థికంగా ఎదిగే అవకాశాలు కల్పించడంపై ప్రతినిధులు చర్చించారు.

రెండోరోజు మరో నాలుగు కీలక అంశాలు

భారత్ సమ్మిట్ రెండోరోజు కార్యక్రమాల్లో భాగంగా మరో నాలుగు తెలంగాణ రైజింగ్ అంశాలపై చర్చలు నిర్వహించనున్నారు. సహకార సమాఖ్యవాదం, సంస్కృతి- సమాజం, యువత-క్రీడలు-రాజకీయాలు, ఎన్నికల సమగ్రత వంటి అంశాలు చర్చకు రానున్నాయి. అంతర్జాతీయ ప్రతినిధులు ఆయా రంగాల్లో తమ అనుభవాలు, అభిప్రాయాలను వెల్లడించనున్నారు.

రాహుల్ గాంధీ రాకతో రాజకీయ ప్రాధాన్యం

రెండోరోజు కార్యక్రమాలకు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రముఖులు కూడా పాల్గొననున్నారు. ముఖ్యంగా గిగ్ వర్కర్ల సంక్షేమం, సామాజిక భద్రతకు సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వ విధాన ప్రకటనపై కూడా అందరి దృష్టి నెలకొంది. ప్రపంచ స్థాయి చర్చలకు హైదరాబాద్‌ను వేదికగా నిలపడంతో పాటు తెలంగాణ అభివృద్ధి నమూనా, సామాజిక న్యాయం, సంక్షేమ విధానాలను అంతర్జాతీయ స్థాయిలో పరిచయం చేసేందుకు భారత్ సమ్మిట్ కీలక అవకాశంగా మారింది. రెండోరోజు జరిగే చర్చలు, ప్రముఖుల ప్రసంగాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

బీజేపీ, బీఆర్ఎస్‌ది ఒకే వైఖరి

-మొదటిపేజీ తరువాయి

తప్పుబట్టారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాష్ట్రానికి వస్తుంటే రాజకీయాలకు అతీతంగా స్వాగతం పలకాల్సిన అవసరం ఉందన్నారు. ఢిల్లీలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ హాజరయ్యారని గుర్తుచేశారు. ఢిల్లీ నాయకులు ఈ కార్యక్రమాన్ని స్వాగతిస్తుంటే, తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రి, బీజేపీ నేతలు మాత్రం వ్యతిరేకించడం ఏమిటని ప్రశ్నించారు. కిషన్ రెడ్డి, కేటీఆర్ విజ్ఞతతో వ్యవహరించాలని సూచించారు.

గిగ్ వర్కర్ల కోసం దేశంలోనే అత్యుత్తమ పాలసీ

గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం తీసుకొస్తున్న విధానం దేశంలోనే అత్యుత్తమంగా నిలుస్తుందని సీఎం పేర్కొన్నారు. కార్మికుల హక్కులు, భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ఈ పాలసీని రూపొందిస్తున్నట్లు తెలిపారు. భారత్ సమ్మిట్‌లో భాగంగా నిర్వహించే గిగ్ వర్కర్ల సమావేశంలో రాహుల్ గాంధీ ప్రసంగిస్తారని వెల్లడించారు.

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకించడంలో ఒకే విధంగా వ్యవహరిస్తున్నాయని రేవంత్ రెడ్డి విమర్శించారు. విదేశీ శక్తులు పాల్గొంటున్నాయంటూ బీజేపీ ఆరోపిస్తుంటే, ప్రజాధనం వృథా చేస్తున్నారంటూ బీఆర్ఎస్ విమర్శలు చేస్తోందన్నారు. కిషన్ రెడ్డి, రాంచందర్ రావు, కేటీఆర్‌లు భారత్ సమ్మిట్‌ను ఎందుకు వ్యతిరేకిస్తున్నారో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. ప్రపంచ పెట్టుబడిదారులకు తెలంగాణలోని వాతావరణ పరిస్థితులు, పారిశ్రామిక అవకాశాలు, హైదరాబాద్ ప్రాధాన్యతను వివరించడం ద్వారా భారీగా పెట్టుబడులను ఆకర్షించవచ్చని తెలిపారు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా గుడ్డిగా వ్యతిరేకించడం బీజేపీ, బీఆర్ఎస్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు. అనవసర ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని హితవు పలికారు.

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. ఈ దిశగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, విదేశీ జర్నలిస్టులను భారత్ సమ్మిట్‌కు ఆహ్వానించినట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అనేక పరిణామాలు, అలజడులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో మార్పు అనివార్యమని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని కూడా ఇప్పటివరకు 106 సార్లు సవరించుకున్నామని గుర్తుచేశారు.

పరిశ్రమలు వస్తేనే యువతకు ఉపాధి

తెలంగాణలో పరిశ్రమలను ఆకర్షించడం ద్వారా యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని రేవంత్ రెడ్డి తెలిపారు. పెట్టుబడులకు తెలంగాణ ఎంతో అనుకూలమైన రాష్ట్రమని, హైదరాబాద్‌కు అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉందని చెప్పారు. రాష్ట్రంలోని మౌలిక సదుపాయాలు, వనరులు, పారిశ్రామిక అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేందుకు భారత్ సమ్మిట్ కీలక వేదికగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ వైఖరి నియంతృత్వ ధోరణిని తలపిస్తోందని విమర్శించారు. రాజకీయ విమర్శలకు అతీతంగా రాష్ట్ర అభివృద్ధికి అందరూ సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

పల్లెలకూ పాకిన గంజాయి మహమ్మారి!

-మొదటిపేజీ తరువాయి

అడుగులు వేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో గంజాయి రవాణా, వినియోగానికి సంబంధించిన ఘటనలు వెలుగులోకి వస్తుండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఆయా ప్రాంతాల్లోని కొన్ని కాలనీలు, ప్రధాన రహదారుల వెంట గంజాయి విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి.

వరుసగా వెలుగులోకి వస్తున్న కేసులు

అశ్వారావుపేట, దమ్మపేట పరిసర ప్రాంతాల్లో గత కొంతకాలంగా గంజాయి రవాణా, నిల్వ, విక్రయాలకు సంబంధించిన పలు ఘటనలు వెలుగులోకి వచ్చాయి. పోలీసులు తనిఖీలు నిర్వహిస్తూ గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు పలువురిని అదుపులోకి తీసుకున్నారు.

ఇటీవల వెలుగుచూసిన కొన్ని ఘటనలు:

- చిల్లగుంపులో ఐదు కిలోలు: దమ్మపేట మండలం చిల్లగుంపులో పోలీసులు ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- సత్తుపల్లిలో 80 మందికి పైగా అదుపులోకి: గంజాయి వ్యవహారానికి సంబంధించి నిర్వహించిన చర్యల్లో దాదాపు 80 మందిని పోలీసులు అదుపులోకి తీసుకోగా, వారిలో ఎక్కువమంది యువకులే ఉండటం చర్చనీయాంశమైంది.
- అచ్యుతాపురంలో 100 కిలోలు: గత జూలైలో అచ్యుతాపురంలోని ఆయిల్‌పామ్ తోటలో 100 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు.
- సరిహద్దులో భారీ పట్టివేత: గత ఏడాది ఆగస్టులో విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న రెండు క్వింటాళ్ల గంజాయిని ఏపీ--తెలంగాణ సరిహద్దులో



స్వాధీనం చేసుకున్నారు.
- రూ.2 కోట్ల విలువైన గంజాయి: విశాఖపట్నం అటవీ ప్రాంతాల నుంచి తరలిస్తున్నట్లు గుర్తించిన సుమారు రూ.2 కోట్ల విలువైన గంజాయిని పోలీసులు పట్టుకున్నారు.

ఈ ఘటనలు గంజాయి సరఫరా నెట్‌వర్క్ విస్తృతిని, అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అవసరాన్ని తెలియజేస్తున్నాయి.

ఈజీ మనీ ఆశతో విక్రయదారులుగా యువత

గంజాయి వినియోగం కంటే దాని సరఫరా వ్యవస్థ మరింత ఆందోళన కలిగిస్తోంది. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో కొందరు యువకులు అక్రమ విక్రయాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థులు సైతం ఈ వ్యవహారాల్లో భాగస్వాములవుతున్న ఘటనలు వెలుగులోకి వస్తుండటం తల్లిదండ్రులను కలవరపెడుతోంది.

విద్యాసంస్థలకు సంబంధించిన కొందరు సిబ్బంది కూడా సులభంగా డబ్బు సంపాదించాలనే ప్రలోభానికి లోనై మాదకద్రవ్యాల విక్రయాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సరఫరా వెనుక ఉన్న ప్రధాన వ్యక్తులు, నెట్‌వర్క్‌లను గుర్తించడం పోలీసులకు సవాలుగా మారుతోంది.

గొలుసుకట్టు దుకాణాలపై ఆరోపణలు

మారుమూల గ్రామాలు, కాలనీలకు సైతం గంజాయి చేరుతున్నట్లు స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో గొలుసుకట్టు దుకాణాలు అక్రమ కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాల్సిన అవసరం ఉంది. గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తులతో పాటు సరఫరా వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను గుర్తిస్తేనే సమస్యను సమర్థంగా అరికట్టే అవకాశం ఉంటుంది.

యువతను కాపాడాల్సిన బాధ్యత అందరిదీ

గంజాయి వ్యసనం ఒక్క వ్యక్తి జీవితాన్నే కాకుండా కుటుంబం, సమాజంపై కూడా ప్రభావం చూపుతుంది. మత్తు పదార్థాల అలవాటు వల్ల చదువు, ఉపాధి, కుటుంబ సంబంధాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. యువతలో మానసిక, సామాజిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు అవగాహన అవసరం. పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలి. గంజాయి సరఫరా చేసే ముఠాలపై పోలీసుల నిఘా మరింత పెరగాలి. కేవలం కేసులు నమోదు చేయడమే కాకుండా సరఫరా మూలాలను గుర్తించి అరికట్టాలి. మత్తు మాయలో పడి యువత భవిష్యత్తు నాశనం కాకుండా పోలీసు యంత్రాంగం, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉంది.

ఆటో కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు!



-మొదటిపేజీ తరువాయి

నిర్మించనున్నారు. ఒక్కో ప్రాంతంలో 500 చొప్పున మొత్తం 2 వేల ఫ్లాట్లు అందుబాటులోకి రానున్నాయి. ఆటో కార్మికులకు గృహ వసతి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

ఇందిరమ్మ టవర్ల విధివిధానాలే వర్తింపు

ఇప్పటికే క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఎల్ఐజీ టవర్ల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపడుతోంది. ఈ పథకానికి సంబంధించిన విధివిధానాలు, అర్హతలు, లబ్ధిదారుల ఎంపిక, కేటాయింపు ప్రక్రియనే ఆటోనగర్ కాలనీలకు కూడా వర్తింపజేయనున్నట్లు జీవోలో స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో అర్హులైన ఆటో కార్మికులకు ఈ పథకం ద్వారా ఇళ్లను కేటాయించే అవకాశం ఉంది.

ఐదు జిల్లాల్లోనూ ఇందిరమ్మ టవర్లు

మరోవైపు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ అల్పాదాయ కుటుంబాలకు గృహ వసతి కల్పించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి చర్యలు చేపడుతోంది. నిజామాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఈ టవర్లను నిర్మించాలని నిర్ణయించింది. హౌసింగ్ బోర్డు భూముల్లో సుమారు రూ.204 కోట్లతో 2,400 ఎల్ఐజీ ఫ్లాట్ల నిర్మాణం చేపట్టనుంది.

దరఖాస్తులకు ఆహ్వానం

ఈ ఫ్లాట్ల కేటాయింపు కోసం అర్హులైన అల్పాదాయ కుటుంబాల నుంచి హౌసింగ్ బోర్డు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. మీ సేవ కేంద్రాల ద్వారా రూ.10 వేల డిపాజిట్ చెల్లించి డిసెంబర్ 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించినట్లు కథనంలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసే ముందు అర్హతలు, డిపాజిట్ నిబంధనలు, తిరిగి చెల్లింపు విధానం వంటి వివరాలను అధికారిక ప్రకటనలో పరిశీలించడం మంచిది.

తెలంగాణ జైళ్ల శాఖకు అరుదైన గౌరవం.. ఒకేసారి 6 ఐఎస్ఓ సర్టిఫికెట్లు

తెలంగాణ కారాగారాలు, సంస్కరణ సేవల విభాగం దేశంలోనే మునుపెన్నడూ లేని విధంగా అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. చర్లపల్లి సెంట్రల్ జైలుతో పాటు చంచల్‌గూడలోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్ సంస్థలు మొత్తం 6 ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ ఐఎస్ఓ సర్టిఫికెట్లను సాధించాయి. భారత జైళ్ల చరిత్రలోనే ఒక రాష్ట్ర కారాగారాల శాఖకు ఒకేసారి ఇన్ని ఐఎస్ఓ గుర్తింపులు లభించడం ఇదే తొలిసారి అని డెక్కన్ క్రానికల్ తన కథనంలో పేర్కొంది. ప్రపంచ క్వాలిటీ వీక్ (నవంబర్ 9 నుంచి 13 వరకు), నాణ్యతా మాసోత్సవాల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా ఈ సర్టిఫికెట్లను అధికారులకు అందజేశారు. చర్లపల్లి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ జి. ప్రమోద్, చంచల్‌గూడ సికా ప్రిన్సిపాల్ ఎస్. శ్రీనివాసరెడ్డి సంబంధిత ధ్రువపత్రాలను స్వీకరించారు.

చర్లపల్లి సెంట్రల్ జైలుకు లభించిన సర్టిఫికెట్లు:

1. ఐఎస్ఓ 9001 -- క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్
2. ఐఎస్ఓ 14001 -- ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (పర్యావరణ పరిరక్షణ)
3. ఐఎస్ఓ 50001 -- ఎనర్జీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఇంధన నిర్వహణ)
4. ఐఎస్ఓ 22000 -- ఫుడ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఆహార భద్రత)

చంచల్‌గూడ సికా సంస్థకు లభించినవి:



1. ఐఎస్ఓ 9001 -- క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్
2. ఐఎస్ఓ 22000 -- ఫుడ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టమ్

గుర్తింపు తెచ్చిన ప్రధాన అంశాలు:

జైళ్లలో పచ్చదనం పెంపొందించడం, పర్యావరణ రక్షణకు ప్రాధాన్యం ఇవ్వడం, సోలార్ విద్యుత్ వినియోగం మరియు ఇంధన ఆదాతో పాటు వనరులను సద్వినియోగం చేసుకోవడంలో చూపిన చొరవకు ఈ గుర్తింపు దక్కింది. ఖైదీలకు అందించే ఆహార తయారీలో పరిశుభ్రత, శుభ్రమైన వాతావరణం, ఆవిరితో అన్నం వండే స్టీమ్ కుకింగ్ వ్యవస్థ, ఆహార ట్రేలపై మూతలు ఉంచి భోజనం పంపిణీ చేసే విధానం ఆహార భద్రత విభాగంలో ప్రత్యేక ప్రశంసలు పొందాయి. అలాగే పాలనాపరమైన ప్రక్రియలను క్రమబద్ధీకరించడం, రికార్డులను పక్కాగా నిర్వహించడం, నిబంధనలను కచ్చితంగా అమలు చేయడం ద్వారా పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచినందుకు నాణ్యతా విభాగంలో సర్టిఫికెట్లు లభించాయి. ఈ సందర్భంగా డాక్టర్ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ, తమ శాఖ నాణ్యత, జవాబుదారీతనం, పర్యావరణ పరిరక్షణ, విద్యుత్ పొదుపు మరియు ఆహార భద్రత పట్ల చూపుతున్న నిబద్ధతకు ఈ సర్టిఫికెట్లు నిదర్శనమని కొనియాడారు. ఈ ఉన్నత ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, భవిష్యత్తులోనూ సమర్థవంతంగా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలకు రూ.311 కోట్ల జరిమానాలు!

తొమ్మిది నెలల్లో హైదరాబాద్ వాహనదారులపై భారీగా చలాన్లు

- కుల్సుంపుర పరిధిలో అత్యధికంగా రూ.22 కోట్లు

- సైదాబాద్ పరిధిలో అత్యల్పంగా రూ.4 కోట్లు

- జరిమానాలు విధిస్తున్నా మారని కొందరి వాహనదారుల తీరు

హైదరాబాద్: నగరంలో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు ఆందోళన కలిగిస్తున్నాయి. కేవలం తొమ్మిది నెలల వ్యవధిలోనే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై మొత్తం రూ.311 కోట్ల జరిమానాలు విధించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అయినప్పటికీ కొందరు వాహనదారుల్లో మార్పు కనిపించడం లేదు. హెల్మెట్, సీట్‌బెల్ట్ లేకుండా ప్రయాణించడం, అతివేగం, రాంగ్ రూట్‌లో వెళ్లడం వంటి ఉల్లంఘనలు కొనసాగుతుండటంతో ప్రమాదాల ముప్పు పెరుగుతోంది. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన జరిమానాల్లో కుల్సుంపుర అగ్రస్థానంలో ఉంది. ఈ ప్రాంతంలో తొమ్మిది నెలల్లో సుమారు రూ.22 కోట్ల జరిమానాలు విధించారు. సైదాబాద్ పరిధిలో అత్యల్పంగా రూ.4 కోట్ల జరిమానాలు నమోదయ్యాయి. నగరంలోని అబిడ్స్, ఆసిఫ్‌నగర్, గుడిమల్కాపూర్, అత్తాపూర్, చిలకలగూడ, బంజారాహిల్స్ తదితర ప్రాంతాల్లోనూ పెద్ద సంఖ్యలో ట్రాఫిక్ ఉల్లంఘనలు నమోదవుతున్నట్లు సమాచారం. ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నా, సీసీ కెమెరాల ద్వారా ఉల్లంఘనలను గుర్తించి చలాన్లు విధిస్తున్నా కొందరు వాహనదారుల ప్రవర్తనలో మార్పు రావడం లేదు. హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకపోవడం, అతివేగంగా వాహనాలు నడపడం, సిగ్నల్ జంప్ చేయడం, వన్‌వేలో ఎదురుదిశగా ప్రయాణించడం వంటి ఉల్లంఘనలు తరచూ కనిపిస్తున్నాయి. ఒకే ద్విచక్ర వాహనంపై ఏడాది వ్యవధిలోనే రూ.20 వేలకు పైగా జరిమానాలు నమోదైన సందర్భాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. రాంగ్ రూట్‌లో వాహనాలు నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణాల్లో ఒకటిగా మారుతోంది. నల్లకుంటలోని ఫీవర్ ఆసుపత్రి సమీపంలో వ్యతిరేక దిశలో వస్తున్న వాహనాన్ని తప్పించుకునే క్రమంలో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న ఓ విద్యార్థి సిటీ బస్సు కిందపడి మృతి చెందిన ఘటన ఈ నిర్లక్ష్యానికి ఉదాహరణగా నిలిచింది.



త్రిగుణ్ 'జంగా' గ్లింప్స్ విడుదల..
రా అండ్ రస్టిక్ లుక్‌లో అదరగొట్టిన హీరో!

శ్రీమతి వనిత కిలారి సమర్పణలో ఆర్‌కె ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్‌పై రమ్య కిలారి, జయచంద్ర నాయుడు కిలారి నిర్మిస్తున్న సరికొత్త చిత్రం 'జంగా'. కెవిన్ గద్దం (శ్రీహరి) దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్‌ను ప్రముఖ దర్శకులు రాంగోపాల్ వర్మ తాజాగా విడుదల చేశారు. త్రిగుణ్ కెరీర్‌లో ఇది సరికొత్త మైలురాయిగా నిలవనుందని ఈ గ్లింప్స్ చూస్తే స్పష్టమవుతోంది. ఈ చిత్రంలో త్రిగుణ్ సరసన నేహా పఠాన్ నటించగా, వరలక్ష్మీ శరత్ కుమార్, శ్రావణ్, మధునందన్, గగన్ విహారి, చందు గౌడ, సమీర్, నాగ మహేష్, భూపాల్ రాజు, రఘు కారుమంచి, రచ్చ రవి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'కొన్ని లక్షల ఏండ్లు పట్టింది.. పశువు మనిషి అవ్వడానికి.. మళ్లీ పశువు అవుతానంటే నేను ఒప్పుకోను.. మనిషి పశువు అయితే.. మరణం వదం అయితాది' అంటూ త్రిగుణ్ చెప్పిన శక్తివంతమైన డైలాగ్స్ సినిమాపై అంచనాలను విపరీతంగా పెంచేస్తున్నాయి. రా అండ్ రస్టిక్ లుక్‌లో త్రిగుణ్ కనిపిస్తుండగా, మరోవైపు వరలక్ష్మీ శరత్ కుమార్ కూడా పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించి ఆకట్టుకుంటున్నారు. మానవ భావోద్వేగాలు, పుట్టుక-చావుల మధ్య ఉండే సంక్లిష్టతలు, ఆధ్యాత్మిక కోణాలను స్పృశిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు కృష్ణ సౌరభ్ సంగీతం అందిస్తుండగా, వెంకట్ సి. దిలీప్ కెమెరామెన్‌గా, ప్రవీణ్ పూడి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రసాద్ వర్మ, ప్రేమ్ రాజ్ మాటలు అందిస్తుండగా, కాసర్ల శ్యాం, పూర్ణాచారి, కళ్యాణ్ చక్రవర్తి పాటలు రాస్తున్నారు. విభిన్న కథాంశంతో వస్తున్న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు ఎప్పుడు రానుందనే దానిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంది.

వారణాసి మూవీ.. వాయిదా పడే ఛాన్స్!

మహేశ్ బాబు- రాజమౌళి కాంబోలో వస్తోన్న మోస్ట్ అడ్వెంచరస్ మూవీ వారణాసి. వీరిద్దరి కాంబోలో వస్తోన్న తొలి చిత్రం కావడంతో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో బాలీవుడ్ భామ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా కనిపించనుంది. మలయాళ సూపర్‌స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రేక్షకుల ముందుకు రానుందని ఇప్పటికే ప్రకటించారు. తాజాగా ఈ మూవీ రిలీజ్ డేట్‌కు సంబంధించిన ఓ టాక్ వైరల్‌గా మారింది. వారణాసి వాయిదా పడనుందనే వార్త సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ముందుగా ప్రకటించిన తేదీకి రాకపోవచ్చని లేటెస్ట్ టాక్. వచ్చే ఏడాది ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు వచ్చే ఛాన్స్ ఉందని నెట్టింట ప్రచారం జరుగుతోంది. మహేశ్ బాబు బర్త్ డే ఆగస్టు 9న కావడంతో అదే నెలలో విడుదలకు ప్లాన్ చేస్తున్నారని రూమర్స్ వినిపిస్తున్నాయి. ఒకవేళ అదే జరిగితే మహేశ్ బాబు ఫ్యాన్స్‌కు డబుల్ బొనాంజా లభించనుంది. బర్త్ డేతో పాటు వారణాసి మూవీని సెలబ్రేట్ చేసుకునే ఛాన్స్ అభిమానులకు దక్కనుంది. కాగా..ఈ చిత్రంలో మహేష్ బాబు రుద్ర పాత్రలో కనిపించనున్నారు. రామాయణ ఎపిసోడ్‌లో కాసేపు శ్రీరాముడిగానూ కనువిందు చేయనున్నారు. ప్రియాంక చోప్రా మందాకిని పాత్ర పోషిస్తుండగా.. మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కుంభగా కనిపించనున్నారు.





టాలీవుడ్‌లో మరో వాయిదా..
రష్మిక 'మైసా' రిలీజ్ డేట్ మారనుందా?

టాలీవుడ్‌లో సినిమాల వాయిదాల పర్వం కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే పలు భారీ చిత్రాలు అనుకున్న తేదీలకు రాలేకపోతుండగా, తాజాగా ఆ జాబితాలో నేషనల్ క్రష్ రష్మిక మందన్న నటిస్తున్న లేడీ ఓరియెంటెడ్ యాక్షన్ మూవీ 'మైసా' కూడా చేరినట్లు ఫిలిం నగర్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రంలో రష్మిక తొలిసారిగా ఒక గిరిజన యువతిగా మైసా అనే ఛాలెంజింగ్ పాత్రలో కనిపించనున్నారు. తన జాతికి జరిగిన అన్యాయంపై పోరాడే ఈ పాత్ర కోసం ఆమె ప్రత్యేకంగా మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ కూడా తీసుకున్నారు. డూప్ లేకుండా రిస్కీ ఫైట్ సీక్వెన్స్‌లలో నటించినట్లు ఇటీవల విడుదలైన టీజర్ ద్వారా స్పష్టమైంది. రవీంద్ర పుల్లే దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా రష్మిక కెరీర్‌లోనే బిగ్గెస్ట్ టర్నింగ్ పాయింట్‌గా మారుతుందని అభిమానులు ఆశిస్తున్నారు. అయితే, ముందుగా ఈ సినిమాను నవంబర్ 27న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. కానీ పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఆలస్యం కావడంతో ఈ విడుదల తేదీ మారే అవకాశం ఉందని తెలుస్తోంది. నవంబర్ 27కి బదులుగా సరిగ్గా వారం రోజులు ఆలస్యంగా డిసెంబర్ 4న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర యూనిట్ యోచిస్తున్నట్లు సమాచారం. త్వరలోనే దీనిపై సినిమా నిర్మాణ సంస్థ నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ప్రస్తుతం వ్యక్తిగత కారణాల వల్ల విదేశీ టూర్‌లో ఉన్న రష్మిక, ఆ ప్రయాణం ముగిసిన వెంటనే సినిమా ప్రమోషన్లలో వేగం పెంచనున్నారు. రావు రమేష్, సముద్రఖని, గురు సోమసుందరం, ఈశ్వరీ రావు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు.

100 అడుగుల క్రేన్ నా కళ్లముందే.. భయంతో వణికిపోయా

సినిమా చూడటానికి తెరపై అందంగానే ఉంటుంది. కానీ తెర వెనక చాలా కష్టంతో పాటు అప్పుడప్పుడు ప్రమాదాలూ జరుగుతుంటాయి. కమల్ హాసన్ 'ఇండియన్ 2' షూటింగ్ సందర్భంగా అలాంటి ఓ ఘోర ప్రమాదం జరిగి ముగ్గురు వ్యక్తులు చనిపోయారు. అయితే తాను ఆ ప్రమాదంలో చనిపోయేదాన్ని అని చెప్పిన కాజల్.. ఎలా బతికి బయటపడ్డానో తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. 'వారం క్రితం సింగపూర్‌లోని నా మైనపు విగ్రహావిష్కరణ జరిగింది. అందులో పాల్గొని తిరిగి ఇండియన్ 2(భారతీయుడు 2) షూటింగ్ కోసం చెన్నై వచ్చాను. స్వాతంత్ర్యానికి పూర్వం జరిగే యాక్షన్ సీన్స్ రాత్రిపూట తీస్తున్నారు. నేను 80ఏళ్ల మహిళగా మేకప్‌లో ఉన్నా. సాధారణంగా మా సీన్స్ లేకపోతే మానిటర్ దగ్గర కూర్చుని చూస్తుంటాం. కానీ ఆ రోజు అక్కడ కూర్చోలేదు. నడుచుకుంటూ ముందుకు వెళ్తుంటే, ఉన్నట్టుండి 100 అడుగుల భారీ క్రేన్ నా కళ్ల ముందే కూలిపోయింది. నా మీద కూడా క్రేన్ పడిపోయిందేమో అనుకున్నా' 'మొదట నేను చనిపోయేదాన్ని. కానీ ఎవరో నన్ను చేయిపట్టుకుని వెనక్కి లాగారనిపించింది. కళ్ల ముందే ప్రమాదం జరగడంతో భయంతో వణికిపోయాను. కదలకుండా ?అక్కడే ఉండిపోయాను. ఒక్కసారి తేరుకుని అందరితో కలిసి పరిగెత్తడం మొదలుపెట్టాను. ఆ సంఘటన తలుచుకుంటే ఇప్పటికీ ఒళ్లు జలదరిస్తుంది. దేవుడి దయ వల్లే ప్రాణాలతో బయటపడ్డాను. అప్పటి నుంచి కృష్ణుడి భక్తురాలిగా మారిపోయా' అని కాజల్ సదరు ప్రమాదం గురించి చెప్పుకొచ్చింది. 'ఇండియన్ 2' విషయానికొస్తే చాలా కష్టాలుపడి 2024లో థియేటర్లలో రిలీజైంది. నిర్మాతకు ఘోరమైన నష్టాలు మిగిల్చింది. దర్శకుడు శంకర్ కూడా దారుణమైన విమర్శలు ఎదుర్కొన్నారు. అప్పటినుంచి శంకర్ మరో కొత్త మూవీ చేయలేదు. ప్రస్తుతం 'ఇండియన్ 3' షూటింగ్ జరుగుతోంది. వచ్చే ఏడాది దీని రిలీజ్ ఉండే అవకాశముంది.



printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512